వీక్షణం

veekshanam fortnightly

ఆర్థిక, సామాజిక పక్షపత్రిక

సంపుటి: 1 సంచిక: 18

సమతా పబ్లికేషన్స్ ప్రచురణ

ఆగస్టు 16-31, 2004

లోపలి పేజీల్లో...

విడి ప్రతి: రూ॥ 6/-

వార్షిక చందా:రూ॥140/-లు

సంపాదకీయం:

గతం వెంటాడుతున్న కొత్త ప్రభుత్వం

పాత ప్రభుత్వం అన్నీ తప్పులే చేసింది; కొత్త ప్రభుత్వం అన్నీ మంచి పనులే చేస్తుంది. కొత్తగా అధికారంలోకి వచ్చిన ప్రతీ ప్రభుత్వం ఈ భావనను కలుగ చేయడానికి ప్రయత్నిస్తుంది. ప్రస్తుతం అధికారం చేపట్టిన కాంగ్రెస్ అందుకు భిన్నమేమీ కాదు. రాజకీయ మార్పు కనుపిస్తూంది; ఇతర విధాలుగా మార్పులు ప్రకటనలస్థాయినుంచి ఆచరణస్థాయికి చేరుకోవాల్సివుంది. ఎన్నికలకు ముందు, ఎన్నికల సమయంలో చేసిన వాగ్దానాలు అమలు అవుతున్నాయా లేదా అని పరీక్షకు పెట్టడం, నూరు రోజుల్లో ఏ ప్రభుత్వమయినా ఇంతకన్నా ఏమి చేయగలదు, అలా పరీక్షపెట్టడం ఆ ప్రభుత్వానికి అన్యాయం చేయడమవుతుందనే సానుభూతితో కూడిన అభిప్రాయ ప్రకటనకు దారితీస్తుంది. అలా కాకుండా కొత్త ప్రభుత్వం పాత విధానాల నుంచి విడగొట్టుకొని, అత్యధిక సంఖ్యాక పేద ప్రజల, సామాన్యులకు అనుకూలమైన విధానాలవైపు మొదటి అడుగువేసిందా అని చూడడం సరైన పరీక్ష అవుతుంది. కొన్ని ప్రజానుకూల ప్రకటనలు చేసినా, నిర్ణయాలు తీసుకొన్నా, వాటిని ఆచరణలో పెట్టాల్సిన ప్రభుత్వ యంత్రాంగం, కొంతమంది అధికారుల స్థానచలనం తప్ప, అదే గాడిలో నడుస్తూండడంతో ఆ నిర్ణయాల ఫలితాలు ప్రజలకు అందని పరిస్థితి. మరికొన్ని నిర్ణయాలు సదుద్దేశంతో చేసినా, ఆ నిర్ణయాలు తీసుకోవటంలో అనాలోచితం, తొందరపాటు వల్ల ఫలితాలు ప్రజలకు అందడంలో సమస్యలు ఎదురవుతున్నాయి. ఒకటి రెండు సందర్భాల్లో ఒకడుగు వెనక్కు వేయాల్సి వచ్చిన పరిస్థితి. ప్రపంచబ్యాంకుతో పేగు సంబంధం పెంచుకొనే సూచనలు కనుపించటం లేదు. గత ఎనిమిదేళ్ళలో అత్యంత నిర్లక్ష్యానికి గురైన వ్యవసాయ, నీటిపారుదల రంగాలకు పెద్దపీట వేయటం ఎంత అత్యంత సముచిత నిర్ణయమో, ఆ రంగాల్లో భూ సంస్కరణలు విస్మరించటం అంతే పెద్ద వెలితి.. నక్సలైట్లతో చర్చలు ఫలవంతం కావటం అనేది ఈ కీలక సంస్కరణ అమలుపై ఆధారపడివుంది. అయినా మరో అయిదు సంవత్సరాలు ఈ ప్రభుత్వానికి ఢోకాలేదు. అంతకాలం ఈ ప్రభుత్వంతో కాపురం చేయటం తప్పదు కాబట్టి, ప్రభుత్వ రైలును ప్రజల పట్టాల మీదకు ఎక్కించగలిగేది ప్రజలనుంచి ఒత్తిడి మాత్రమే.

వచ్చే సంచిక ఫోకస్: విద్యుచ్ఛక్తి

మూడు నెలల పాలన మూడురోజుల ముచ్చట కాకూడదు

-ప్రొఫెసర్. జి. హరగోపాల్

రాజకీయాల్లో, పాలనా ప్రక్రియలో మూడు నెలల్లో అంత అనుకోదగ్గ, అంచనా వేయదగ్గ కాలం కాదు. అందులో తొమ్మిది సంవత్సరాల తర్వాత అధికారంలోకి వచ్చిన వాళ్లకు ఇది ఒక రకంగా చెప్పాలంటే 'హనీమూన్' పీరియడ్. ప్రజల మద్దతు, వాగ్దానాల ధాటి, విజయోత్సాహం, రాజ్యాధికారంలో ఎలాంటి లక్ష్యాలైనా సాధిస్తాం అనే ధీమా. కాని ఇవన్నీ ఒక ఎత్తైతే, అభివృద్ధి దిశ, సామాజిక మార్పు తీరు, పాలనా సంస్కృతి కొత్త పంథాలో ఏమైనా వెళ్లున్నదా? దాని కొరకు తీసుకొంటున్న చర్యల గురించి ఒక అంచనా వేయటానికి ప్రయత్నం చేయవచ్చు. దీంట్లో భాగంగా మూడు అంశాలను ప్రస్తావించాలి. ఒకటి, వ్యవసాయ రంగానికి ప్రాధాన్యత; రెండు, ఉపాధి రంగం, మూడు, శాంతి భద్రతల అంశంలో పాటిస్తున్న నియమాలు, నియంత్రణ. ఈ మూడింటినీ గత ప్రభుత్వం దాదాపు ధ్వంసం చేసింది. అందుకే ఈ అంశాలు ఇంత ప్రాధాన్యతను పొందాయి.

ఒకటి: వ్యవసాయరంగంలో పాలసీల్లో కొన్ని మార్పులు వస్తున్నట్లు కనుపిస్తున్నది. అంటే ఈ ప్రభుత్వం వ్యవసాయక సంబధాల్లో మౌలిక మార్పులు తీసుకొస్తుందని కాదు, కాని ఈ రంగానికి కొంత పెద్ద పీట వేయవచ్చు. దీనికి ప్రభుత్వ చిత్తశుద్ధి కంటె కూడా, వ్యవసాయ రంగంలో వచ్చిన సంక్షోభం, ఎన్నికలు జరుగుతున్న తరుణంలో కూడా రైతుల ఆత్మహత్యలు కొంత వరకు సమాజాన్ని కలచి వేశాయి. ఈ సంక్షోభం వలన ధనిక రైతు నుండి వ్యవసాయ కూలీ దాకా అందరు కట్టకట్టుకొని కాంగ్రెసుకు పట్టం కట్టారు. ఈ సామాజిక రాజకీయ పునాదికి దాని మద్దతును విస్మరించలేని పరిస్థితి ప్రస్తుత ప్రభుత్వానికి వచ్చింది. అందుకే రైతులకు విద్యుచ్ఛక్తి సరఫరాతో ప్రారంభమై, భారీ నీటి పారుదల ప్రాజెక్టుల శంకుస్థాపన దాకా ఒక కొత్త వాతావరణం కనిపిస్తున్నది. అయితే ఈ ప్రయత్నాలు చాలాకాలం నిలుస్తాయా లేదా అనడానికి రాష్ట్ర వనరులు ఒక కారణమైతే, రైతాంగం ఎన్నికల్లో వ్యక్తీకరించిన విస్తృత ఆకాంక్ష వ్యవస్థీకృతమవుతున్న దాఖలాలు ఏం లేవు. ఆకాంక్షలో వ్యవస్థీకృతం కాకుండా వాటిని అమలు పరచే రాజకీయ చిత్తశుద్ధి ఏ పార్లమెంటరీ రాజకీయ పార్టీకి లేదు. అలాంటి చిత్తశుద్ధి ఉంటే రైతాంగాన్ని నిరంతరంగా అభివృద్ధికి సమీకరించే ప్రక్రియ ఉండాలి. నాకు తెలిసినంత వరకు కాంగ్రెసు అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక పెద్ద సభ జరిగింది, ఆ తర్వాత రాజీవ్ పల్లెబాట పేరు మీద ముఖ్యమంత్రి రాష్ట్రంలో హెలికాప్టర్‌లో తిరుగుతున్నారు. కాని కాంగ్రెస్ కార్యకర్తలు గ్రామాల్లో రైతాంగ సమస్యలో భాగంగా, నిరంతరంగా స్పందిస్తున్న సాక్ష్యాలు ఏమీ లేవు. ఏ పార్టీ ఐనా తనపార్టీ కేడర్‌ను ఎన్నికలప్పుడు తప్పించి, ఇతర కాలంలో బలపడనీయడం లేదు. నిజానికి పలు గ్రామాల్లో రైతుల తరపున ఒత్తిడి పెట్టగలిగి, ధైర్యంగా స్వేచ్ఛగా ప్రజల సమస్యలను పార్టీ దృష్టికి తీసుకవచ్చి, పార్టీమీద రాజీలేని వత్తిడి పెట్టగలగాలి, రైతులను Organise చేయగలగాలి. అలాంటి మౌలిక ప్రయత్నాలు ఏమీ జరుగుతున్న దాఖలాలు లేవు. ఆ అంశం ఇపుడు ప్రస్తావించడానికి కారణం, అలాంటి ప్రయత్నాలు on ground మీద జరగకుండా వ్యవసాయరంగానికి ప్రాముఖ్యత అనేది నినాదంగా తయారయ్యే ప్రమాదం ఉంటుంది. ఇంకా లోతుగా వెళ్ళి వ్రాయాలంటే వ్యవసాయరంగంలో అంతర్గతంగా ఉండే వైరుధ్యాలు; ధనిక రైతుకు వ్యవసాయ కూలీలకు, అభివృద్ధి చెందిన ప్రాంతానికి చెందని ప్రాంతానికి, వ్యాపారస్థులకు, వ్యవసాయదారుడికి, పారిశ్రామిక రంగానికి వ్యవసాయానికి, సాంకేతిక పరిజ్ఞానానికి, శ్రమకు...ఇలా ఎన్ని వైరుధ్యాల గురించైనా పేర్కొనవచ్చు. ఈ వైరుధ్యాలు తప్పకుండా ముందుకు వస్తాయి. వీటిని పరిష్కరించటానికి కావలసిన రాజకీయ చిత్తశుద్ధి, పరిణితి, పట్టుదల అన్నిటికి మించి ఒక మౌలిక మార్పు గురించి కాంగ్రెసు పార్టీకి ఒక అవగాహన లేదనే చెప్పాలి.

రెండు: ఉపాధి కల్పన. ఇది కూడా గ్రామీణ ప్రాంతంలో ఉండే కూలీలని, పేదవారిని పట్టణాలలో నివసించే చదువుకున్న యువతరాన్ని నిరంతరంగా వేధిస్తున్న సమస్య. అందరికీ పని కల్పించడమెలా? ఈ పని ప్రభుత్వోద్యోగాలే కానక్కరలేదు. ఇవి మొత్తంగా ఆర్థిక ఉత్పత్తి విధానానికి సంబంధించిన సమస్య.

గ్రామీణ ప్రాంతాల్లో ఇది భూపంపిణీతో ముడిపడి ఉంది. అలా అయితేనే అందరికీ అవకాశాలు కలిగి నూతన ఆర్థిక వ్యవస్థకు దారివేయగలదు. ఈ ప్రశ్న ప్రధానంగా చర్చలోకి వస్తున్నది. అదొక్కటే అహ్వానించదగ్గ మార్పు. కాని దాన్ని అమలు చేయడానికి, కావలసిన 'రాజకీయ వనరులు', 'రాజకీయ సృజనాత్మకత' ఇపుడు అధికారంలో ఉన్న పార్టీకి ఉన్నాయనుకుంటే పొరపాటే. అలాగే పారిశ్రామిక రంగంలో ఉపాధి ప్రాధాన్యత కలిగిన పెట్టుబడిని, సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రోత్సాహించ కలగాలి. ఇది దాదాపు ప్రపంచీకరణకు, గత ప్రభుత్వ ఆలోచనకు సంపూర్ణంగా వ్యతిరేక దిశలో ప్రయోగించడం. నిజానికి ప్రపంచీకరణకు దారులు వేసిన వారే కేంద్ర ప్రభుత్వంలో అధికారానికి వచ్చారు. మార్పల్లా 'మానవీయ ముఖంలో అభివృద్ధి' అంటున్నారు. అంటే అభివృద్ధి అమానుషమని అంగీకరించడమే. అభివృద్ధికి కేవలం మానవీయ ముఖమే ఎందుకు, అభివృద్ధే మానవీయంగా జరగవచ్చు కదా. ముఖం మానవీయంగా కనిపించి వెుదడు, హృదయం మానవీయంగా లేకపోతే ఏం ప్రయోజనం? గత ప్రభుత్వాల అమానుష చర్యలను ప్రజలు తిప్పి కొట్టారు. ప్రజల ఆగ్రహాన్ని అదుపులో పెట్టడానికి నవ్వుతున్న ముఖం సరిపోదు. దాని కొరకు పనిచేసే మానవీయ సంస్కృతి కలిగిన ప్రభుత్వం కావాలి.

మూడు: శాంతి భద్రతలు ఈ విషయంలో గత రెండు దశాబ్దాలుగా ఆంధ్ర రాష్ట్రంలో ప్రమాణాలు పాతాళంలోకి పోయాయి. చట్టబద్ధంగా నడుచుకోవలసిన ప్రభుత్వం దాని ప్రధాన అంగమైన పోలీసు యంత్రాంగానికి చట్టమనేది ఉన్నదన్న కనీస స్పృహ కూడా లేకుండా పోయింది. దీనికి పోలీసులనే నిందించి లాభంలేదు. పోలీసులను నియంత్రించవలసిన పాలనా యంత్రాంగం, న్యాయవ్యవస్థ, రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు మీడియా దాదాపు నీచ ప్రమాణాలతో రాజీ పడ్డాయి. ఇదంతా నక్సలైట్ ఉద్యమాన్ని ఎదుర్కొనే పేరు మీద జరిగింది. దీంట్లో నక్సలైట్ ఉద్యమం ఒక విషయంమాత్రమే. అసలు జరిగిన మార్పు ఆర్థిక రంగంలో క్రమేణా పెరిగిన 'లంపెన్ వర్గం' లాండ్ మాఫియా, లిక్కర్ మాఫియా, కాంట్రాక్టర్ మాఫియా, విద్యా వ్యాపార మాఫియా ప్రభావం అతి నికృష్ట స్థాయికి చేరుకొంది. ఈ వర్గానికి డబ్బులు, మీడియా పై ప్రభావం. దీనితో ఈ వర్గం రాజకీయాలను నియంత్రించే స్థితిలో ఉంది. ఈ వర్గమే గత ప్రభుత్వాన్ని ముఖ్యంగా చంద్రబాబు నాయుడిని అంతర్జాతీయ నాయకుడిగా Project చేసింది. అయితే ఈ వర్గానికి విపరీత వనరులుంటాయి. కాని కనీస మానవీయ విలువలు కూడా ఉండవు. అలాంటి వర్గం పాలనను ఏ నీచస్థాయికైనా తీసుక.వెళ్తుంది. ఆక్రమంలోనే శాంతి భద్రతల పేరుమీద అమాయకమైన మనుషులను చంపినా పట్టించుకోని పరిస్థితి ఏర్పడింది. దాంతో పిల్లలకు చదువు చెప్పే ఉపాధ్యాయులు వెుదలుకొని అమాయకులైన ముసలి తల్లిదండ్రులను, అమాయకమైన పిల్లలను కూడా పీడించారు. నిజానికి చంద్రబాబు ఓడిపోవడానికి ఇదొక ప్రధాన కారణం. పాలనలో విసిగిపోయిన ప్రజలు ఎన్నికల్లో తమ అనుభవాన్ని అభిప్రాయాన్ని స్పష్టంగా వ్యక్తీకరించారు. చాలా కాలం తర్వాత శ్రమలో, ఉత్పత్తిలో భాగమైన వర్గాలు మాఫియాను తిరస్కరించాయి. అయితే మాఫియాను ఓడగొట్టామనుకుంటే పొరపాటే.

ఎన్నికల్లో దెబ్బతిన్న మాఫియా, క్రమాణా కాంగ్రెసుపార్టీ మద్దతు దార్లుగా మారి ఇప్పుడున్న కొద్దిపాటి ప్రజాస్వామ్య సంస్కృతిని కూడా ధ్వంసం చేయవచ్చు. అనంతపూర్‌లో ఇప్పుడు ఆ సూచనలు కన్పిస్తున్నాయి. నక్సలైట్ పార్టీలతో ప్రధానంగా పీపుల్స్‌వార్ పార్టీతో శాంతి చర్చలు ఈ చట్రంలోనే అర్థం చేసుకోవాలి. ఈ చర్చలో ముందుకు పోవాలంటే కాంగ్రెసుపార్టీ మాఫియా సంస్కృతినుండి సమాజాన్ని కొంచెమైనా రక్షించాలంటే ఈ చర్చలు సఫలం కావాలి. ఒక విప్లవపార్టీ మరింత స్వేచ్ఛగా పనిచేసే అవకాశాలుంటే పోలీసులు, మాఫియా కాస్త వళ్ళు దగ్గర పెట్టుకునే మసలుకుంటారు. అలాగే ఈ ప్రజా ఉద్యమాల్లో వచ్చిన కొన్ని వ్యక్తీకరణలు తగ్గి ఈ ఉద్యమాలు ప్రజలకు మరింత బాధ్యత వహించి పనిచేస్తే, కాంగ్రెసు పార్టీ తాను ప్రజల అభివృద్ధికి చేస్తామన్న కార్యక్రమాలని మరింత పట్టుదలగా చేయవచ్చు. అలా చేయగలిగితే ఇప్పుడు అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ, ఆ పార్టీ నాయకులను ప్రజలు గౌరవించడమే కాక వాళ్ళ సామాజిక పునాది మరింత విస్తృతమవుతుందని, అది ఒక చారిత్రిక మలుపు అవుతుందని, ఈ మూడు నెలల పాలన మూడు రోజుల ముచ్చటగానే మారదని మారకూడదని ఆశిద్దాం. *

ఒక అడుగు ముందుకి, రెండవ అడుగులు వెనక్కి

- కొమరయ్య

డా. వై.ఎస్. రాజశేఖరరెడ్డి నాయకత్వంలోని కొత్త ప్రభుత్వం అధికారం చేపట్టి వందరోజులు గడిచింది. తొమ్మిది సంవత్సరాలపాటు సాగిన చంద్రబాబునాయుడు ప్రజావ్యతిరేక, ప్రపంచబ్యాంకు నిర్దేశిత, దుష్టపాలనతో విసిగి వేసారిన ప్రజలు అసాధారణమైన తీర్పుతో కాంగ్రెస్‌కు అధికారం కట్టబెట్టారు. కాంగ్రెస్‌పట్ల సదభిప్రాయంతో కన్నా, తెలుగుదేశంను గద్దెదించాలనే ఉద్దేశ్యంతోనే ఈ జనాదేశం వ్యక్తమయింది. అందువల్ల, కాంగ్రెస్ ప్రభుత్వం వేసే ప్రతి అడుగునూ, తీసుకునే ప్రతి చర్యనూ పాత ప్రభుత్వ విధానాలతో పోల్చి చూడడం, అనుకూల-ప్రతికూల అంశాలను ఆ గీటురాయి మీదనే పరిశీలించడం సహజమే.

అటువంటి పరిశీలనకు పూనుకున్నప్పుడు మొత్తం మీద కాంగ్రెస్ పాలనకూ, తెలుగుదేశం పాలనకూ మధ్య పెద్ద తేడా ఏమీలేని స్థితి కనబడుతోంది. కాకపోతే కొన్ని ప్రజానుకూల విధానాలను అమలు చేయడానికి పూనుకొంటున్నట్టు సన్నాహాలు ప్రారంభించింది. కాని, గత అనుభవాలతో పోలిస్తే, కాంగ్రెస్ పార్టీకి ఇటువంటి ప్రజానుకూల ప్రకటనలు చేయడం; ఆర్భాటం చేయటం కొత్తకాదు. కాని దేశ రాజకీయాలలో గాని, రాష్ట్ర రాజకీయాలలోగాని ఆ ప్రకటనలు ప్రకటనలస్థాయిలోనే ఆగిపోయాయి. నిజమైన ఆచరణ ఆ ప్రకటనలకు అనుకూలంగా కాక, సంపన్నులకు అనుకూలంగా, స్వార్థపరశక్తులకు ప్రయోజనకరంగా, ప్రజావ్యతిరేకంగా సాగింది.

ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా గత వందరోజులలో చేసిన చాలా ప్రకటనలు ప్రజానుకూలంగా కనబడుతుండవచ్చుగాని అవి అమలులోకి రాకపోవడానికే ఎక్కువ అవకాశాలున్నాయి. ప్రజల ఆకాంక్షలు ఏ రూపంలో వ్యక్తమవుతున్నాయి. తాను ఎన్నికల ప్రణాళికలోను, ఇతరంగాను ఏ వాగ్దానాలు చేశాను-అనే వాటితో సంబంధం లేకుండా ప్రజల ఆశలను భగ్నం చేయడం, తన వాగ్దానాలను తానే విస్మరించడం కాంగ్రెస్ పార్టీకి ఆరుదశాబ్దాలుగా తెలిసిన విద్యే.

ఇంకా వందరోజులు పూర్తిగా గడవకుండానే కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఇంత తీవ్రంగా విమర్శించవచ్చునా, వారికి మరికొంత వ్యవధి ఇవ్వకూడదా అని కొందరు ప్రశ్నిస్తున్నారు. నిజమే, ఐదు సంవత్సరాల కొరకు అధికారంలోకి వచ్చిన ప్రభుత్వాన్ని వంద రోజుల ఆచరణను పట్టి విమర్శించడం ఉచితం కాదు. కాని వందరోజులలోనే ప్రభుత్వం ఏ మార్గం అనుసరించబోతున్నదో దిశానిర్దేశం అయిపోయింది. ఈ దిశ 2004 జనాదేశానికి అనుగుణమైన దిశ కాదు. కాంగ్రెస్ ఎన్నికల ప్రణాళికలో, ఎన్నికల ముందు వాగ్దానాలలో వ్యక్తమైన ప్రజానుకూలతకు, గత ప్రభుత్వ వ్యతిరేకతకు అనుగుణమైన దిశ కాదు. ఏయేరంగాలలో ప్రభుత్వం తన వాగ్దానాలను తానే మింగివేస్తున్నదో పరిశీలించడానికి ఈ వందరోజుల ఆచరణ సరిపోతుంది.

ఆర్థిక "సంస్కరణ"ల పట్ల, నూతన ఆర్థిక విధానాల పట్ల, ప్రపంచీకరణ పట్ల కాంగ్రెస్ ప్రభుత్వ అవగాహన ఏమిటి? అది మౌలికంగా తెలుగుదేశం ప్రభుత్వ వైఖరి కన్న భిన్నమైనదా? ఈ దేశంలోకి నూతన ఆర్థిక విధానాలను ప్రవేశపెట్టినది కాంగ్రెస్ పార్టీయే అయినప్పటికీ, చంద్రబాబునాయుడు ప్రపంచబ్యాంకు కీలుబొమ్మగా ప్రవర్తిస్తూ, ఆంధ్రప్రదేశ్‌ను ప్రపంచబ్యాంకు ప్రయోగశాలగా మార్చినప్పుడు, రాజశేఖరరెడ్డి నాయకత్వం లోని కాంగ్రెస్ పార్టీ ఆ విధానాలను తీవ్రంగా ఖండించింది. వామపక్షాలతో కలిసి ఆందోళనలకు దిగింది. అందువల్ల ప్రపంచీకరణ విధానాలను పూర్తిగా రద్దు చేయకపోయినా, కనీసం ప్రపంచీకరణకు మానవ ముఖం అతికించే పనినైనా కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తుందని ప్రజలు భావించారు. తొమ్మిది సంవత్సరాలలో ప్రపంచీకరణ క్రమంలో అస్తవ్యస్తమయిపోయిన ప్రజాజీవనాన్ని, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను మళ్లీ పట్టాల మీదకు ఎక్కించే ప్రయత్నాన్నయినా కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తుందని ఆశించారు. ప్రపంచబ్యాంకుతో రాష్ట్రానికి ఏర్పడిన సంబంధాలను ఒక్క క్షణంలో రద్దు చేసే అవకాశం లేకపోయినా, కనీసం పునస్సమీక్ష ప్రారంభమవుతుందని, రాష్ట్ర ప్రయోజనాలకు భిన్నంగా ఉన్న ఒప్పందాలను రద్దు చేయడం మొదలవుతుందని ఆశించారు.

ఈ వంద రోజుల పాలనలో ఇది అడియాసే అయింది. అటు ముఖ్యమంత్రి గాని, ఇటు ఆర్థికమంత్రి గాని ప్రపంచబ్యాంకు నిర్దేశిత విధానాలను ఖండించలేదు సరికదా ఎన్నోసార్లు సమర్థించారు. పాత ప్రభుత్వ విధానాలను కొనసాగిస్తామని ఒకటికి రెండుసార్లు హామీ ఇచ్చారు. రైతాంగానికి ఉచిత విద్యుత్తుపై ప్రపంచబ్యాంకు అభ్యంతరం వ్యక్తం చేస్తే, దృఢంగా నిలబడకపోగా, ప్రపంచబ్యాంకును బుజ్జగించడానికి ప్రయత్నించారు. మరిన్ని ప్రపంచబ్యాంకు రుణాలు తెస్తామని ప్రకటించారు. ఇంకా కఠినమైన షరతులతో కూడిన

ఆస్ట్రియా రుణాల వైపు పరుగులు తీశారు. కనీసం విద్యుత్ ఛార్జీల వ్యతిరేక ఆందోళన నాటి నుంచి 2004 ఎన్నికల దాకా రాజశేఖరరెడ్డి స్వయంగా చేసిన వందలాది ప్రకటనలకు ఆయన ప్రభుత్వమే ఈ వంద రోజులలో తూట్లు పొడిచింది. ఆ ఉద్యమ కాలంలో ఆయన సహచరులుగా ఉండిన వామపక్షాలు, ఆ వంద రోజులలో ఆయన దారి తప్పుతున్నాడని హెచ్చరించలేదు సరిగదా, కుంటి సాకుల సమర్థనలు ప్రారంభించాయి.

"సంస్కరణల" పట్ల మొత్తంగా వ్యక్తమయిన ఈ దృక్పథమే విడివిడిగా అనేక రంగాలలో వ్యక్తమవుతోంది. తెలుగుదేశం ప్రభుత్వం మీద తొమ్మిది సంవత్సరాలు పోరాడిన వారికి, తెలుగుదేశం విధానాలను అడుగడుగునా విమర్శించిన వారికి, అవే విధానాలను తు.చ. తప్పకుండా అమలు చేయడానికి ఎటువంటి అభ్యంతరమూ కనబడడం లేదు! పారిశ్రామిక వేత్తలతో, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ పరిశ్రమాధిపతులతో ప్రభుత్వం జరుపుతున్న సంభాషణలలో పాత విధానాలలో మార్పు ఉండబోదనే ప్రకటన పదేపదే వినిపిస్తోంది. 2004 జనాదేశానికి ఇంత వేగంగా ద్రోహం చేయడం, ఇప్పటికీ ఒక వైపు తెలుగుదేశం వ్యతిరేక వాగాడంబరాన్ని ప్రదర్శిస్తూనే, తెలుగుదేశం విధానాలను అమలు చేయడం కాంగ్రెస్‌పార్టీకే చెల్లింది. బడ్జెట్ విషయంలో అది పూర్తి బడ్జెట్ కాదని, కేవలం తెలుగుదేశం వదిలి పోయిన బడ్జెట్‌కు కొనసాగింపుగా తయారయిన మధ్యంతర బడ్జెట్ మాత్రమేనని సమర్థన తెచ్చుకున్నా అనేక ఇతర రాజకీయార్థిక విధానాలలో తెలుగుదేశం విధానాలను నిర్ణయాత్మకంగా, స్థిరంగా వదులుకుంటున్న జాడలు లేవు. ఇంకా బలంగా కొనసాగించడానికే పూనుకుంటున్న సూచనలున్నాయి.

మొట్టమొదట చెప్పుకోవలసింది పాలనా వ్యవహారాలు. 2004 జనాదేశంతో గొప్ప మార్పు జరిగిందని ప్రజలు, పరిశీలకులు అనుకున్నారు. చంద్రబాబునాయుడును ఇంత కాలమూ తీవ్రంగా విమర్శించిన రాజశేఖరరెడ్డి రాష్ట్ర పాలనను గుణాత్మకంగా మార్చివేయనున్నారని ఆ ప్రకటనలు చూసిన వారెవరికయినా అనిపించింది. కొత్త ప్రభుత్వం ఏమీ కక్ష సాధింపు చర్యలు తీసుకోనవసరంలేదు గాని, తమ విధానాలు భిన్నమైనవైతే, ఆ విధానాలను అమలు చేసేందుకు భిన్నమైన పాలనా వ్యవస్థను తయారుచేయవలసి ఉంటుంది. పాలనా వ్యవస్థను సమూలంగా మార్చడం సాధ్యం కాక పోవచ్చు గాని, గత ప్రభుత్వంలో అంతా తామే అయి, ఉద్యోగులలా కాక రాజకీయవాదులలా ప్రవర్తించిన వాళ్లనైనా మార్చవలసి ఉంటుంది. రాజశేఖరరెడ్డి ప్రభుత్వం ఆ పని చేయకపోగా, తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో ముఖ్యులుగా, చంద్రబాబు నాయుడు అనుచరులుగా, ఉద్యోగధర్మంగా మాత్రమే కాక అవగాహనల్లో కూడా చంద్రబాబు తైనాతీలుగా వ్యవహరించిన వాళ్ళను ఆయాస్థానాల్లో యధాతథంగా కొనసాగిస్తున్నారు. మొదటి నెలలోనే మాటవరుసకు పెద్ద ఎత్తున బదిలీలు జరిగినప్పటికీ, ఆ బదిలీలలో లాభపడిన వాళ్ళు చంద్రబాబు నాయుడు అనుచరులే. నిర్ణయాత్మక స్థానాలలో పాత ప్రభుత్వ 'మైండ్ సెట్' కొనసాగుతుండగా, ప్రధాన రాజకీయార్థిక నిర్ణయాలు చేసే స్థానాలన్నిటిలోనూ చంద్రబాబు విధానాలు యధాతథంగా సాగే ఏర్పాట్లు జరిగిపోయాయి. ప్రభుత్వాధినేతగా ఈ మార్పులు రాజశేఖర రెడ్డికి తెలియకుండా ఉంటాయనుకోలేము.

చీఫ్‌సెక్రటరీ, డైరెక్టర్ జనరల్ ఆఫ్‌పోలీస్ వంటి కీలక స్థానాలలో ఏ మార్పు రాకపోగా, జరిగిన మార్పులలో కొన్ని చాల తెలివిగా, దూరదృష్టితో, చంద్రబాబునాయుడు ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని జరిగాయి. చంద్రబాబు నాయుడు పాలనా కాలంలో ఐఎఎస్, ఐపిఎస్ అధికారులలో లంచగొండితనం మరిచెట్టులా విస్తరించి, ప్రశాసన నగర్‌లోని కోట్లాది రూపాయల భవనాలతో బహిరంగంగా కనబడుతుండగా, ఆ లంచగొండి అధికారులందరికీ కొత్త బదిలీలలో కూడ కీలకస్థానాలు లభించాయి. చంద్రబాబు హయాంలో వేలకోట్ల రూపాయల పరికరాల కొనుగోలుకు, అంతే వందలకోట్ల రూపాయల ముడుపులకు బాధ్యత వహించవలసిన ఒక సంస్థకు చంద్రబాబు నాయుడికి తొమ్మిది సంవత్సరాలుగా అనుంగుశిష్యుడిగా ఉన్న అధికారిని అధిపతిని చేశారు. గత తొమ్మిది సంవత్సరాలలో అనేక శాఖలలో అత్యంత అవినీతిపరుడుగా పేరు తెచ్చుకున్న మరొక అధికారికి అవినీతి విచారణలకు అధిపతిగా నియమించారు. ఇక పోలీసు అధికారుల బదిలీలు, నియామకాల గురించి ఎంత తక్కువ చెప్పుకుంటే అంత మంచిది. ఈ మూడు నెలల్లో చంద్రబాబు కుటుంబసభ్యులు ఎదుర్కొన్న రెండు ప్రముఖ నేరారోపణల్లో పోలీసు అధికారులు వ్యవహరించిన తీరు, ఇంకా రాష్ట్ర పోలీసు వ్యవస్థ మాజీ ముఖ్యమంత్రి జేబులో ఉన్నదని తెలియజేస్తుంది.

పాలనా వ్యవహారాలలో ఈ అవ్యవస్థ కొనసాగుతుండగా, అవినీతి పెచ్చరిల్లుపోతున్నదని సర్వత్రా వినిపిస్తోంది. గత ప్రభుత్వంలో అవినీతి ఎటువంటి పద్ధతుల్లో కొనసాగిందో, సరిగ్గా అదే పద్ధతుల్లో ప్రస్తుత ప్రభుత్వం కూడ అవినీతి కొనసాగిస్తున్నదని పరిశీలకులు అంటున్నారు. 'ఏ కొత్త ప్రభుత్వమైనా కొంత కాలమైనా నీతిగా ఉన్నానని చూపుకుంటుంది. వసూళ్ళకు ఇంకా ఐదు సంవత్సరాల సమయం ఉంది గదా అనుకుంటుంది. కాని ఈ ప్రభుత్వం ఇక రేపు దిగిపోతానేమోనన్నంత ఆబగా వసూళ్ళు మొదలు పెట్టింది' అని ప్రభుత్వం పట్ల సానుభూతిగా ఉండే పరిశీలకులే అంటున్నారంటే

పరిస్థితి ఎంత దిగజారుతున్నదో అర్థమవుతున్నది. ఉద్యోగుల బదిలీల విషయంలో అవినీతి జరిగిందని పత్రికలు, ప్రతిపక్షాలు అంటున్న మాటలను కూడ పూర్తిగా కొట్టివేయడానికి వీలు లేదు. ఒకటి రెండు పత్రికలు ప్రభుత్వం మీద కత్తికట్టి అనవసర వివాదాలు సృష్టిస్తున్న మాట వాస్తవమే అయినా, అవినీతి ఆరోపణలను పరిగణనలోకి తీసుకోవలసి ఉంది.

ఇక్కడనే చెప్పుకోవలసింది పాత ప్రభుత్వాల తప్పిదాల సవరణ. కొత్త ప్రభుత్వం అధికారంలోకి రాగానే గత ప్రభుత్వపు ప్రజావ్యతిరేక నిర్ణయాలన్నిటినీ రద్దు చేస్తుందని ప్రజలు ఆశించారు. నిజానికి రాజశేఖరరెడ్డి స్వయంగా ఆ నిర్ణయాలను ఖండిస్తూ, వ్యతిరేకిస్తూ 2004 మే కు ముందు వందలాది ప్రకటనలు చేశారు. తాము అధికారంలోకి వస్తే ఆ నిర్ణయాలను తిరగదోడుతామన్నారు. కాని విచారణలకు ఆదేశించినవి కేవలం ఏడెనిమిది నిర్ణయాలు పైన మాత్రమే. అక్కడికే తెలుగుదేశం గగ్గోలు పెట్టి, బ్లాక్‌మెయిల్ చేసి ఆ విచారణలు జరగకుండా చేయాలనుకుంటున్నది గాని నిజానికి విచారణ అనేదే సాచివేతమార్గం. విద్యుత్ కొనుగోలు ఒప్పందాలు, పారిశ్రామికాధి పతులకు భూముల పందారాలు, ఓడరేవులు, పన్ను మినహాయింపులు వంటి చర్యలను ఏ విచారణ లేకుండానే రద్దు చేయవలసి ఉంది. తొమ్మిది సంవత్సరాల పాటు ప్రతిపక్షంగా కాంగ్రెస్, వామపక్షాలు ఆ నిర్ణయాల ప్రజావ్యతిరేకతను బహిరంగంగా, హేతుబద్ధంగా ప్రకటించి ఉన్నాయి. కొత్త ప్రభుత్వం అటువంటి నిర్ణయాలను రద్దు చేయకపోగా, విచారణకు ఆదేశించడం ఒక ఎత్తయితే, హైదరాబాద్ శివారు భూములను పరిశ్రమల పేరు మీద సంపన్నులకు కట్టబెట్టడం పై విచారణ కోసం కాంగ్రెస్‌లోని కొందరు శాసనసభ్యులే పట్టు పట్టవలసి వచ్చింది. ప్రభుత్వం ఎంతో సంకోచంతో గాని విచారణకు ఆదేశించలేదు. రహేజాలకు భూమి ఇవ్వడానికి, ఐఎంజికి భూమి, స్టేడియంల నిర్వహణ అప్పగించడానికి గత ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు ప్రజావ్యతిరేకమైనవి, అవినీతి కుంభకోణాల మయమని బహిరంగంగా తెలిసినప్పటికీ కొత్త ప్రభుత్వం వాటిని రద్దు చేయలేదు సరిగదా కొనసాగించడానికి నిర్ణయించుకుంది.

కొత్త ప్రభుత్వం ప్రమాణ స్వీకారం చేసిన నాటి నుంచే వ్యవసాయం మీద దృష్టి కేంద్రీకరిస్తానని, రైతాంగానికి మేలు చేసే విధానాలు అమలు చేస్తానని ప్రకటిస్తోంది. ఈ రంగంలో కొన్ని ప్రజానుకూల చర్యలు ప్రకటించింది కూడ. అంతవరకు ఆహ్వానించదగిందే. కాని ఈ చర్యలు ప్రకటనలకే పరిమితమవుతాయి, ఆచరణ రూపం ధరిస్తాయా వేచి చూడవలసి ఉంది. రైతుల ఆత్మహత్యలు మూడునెలల తర్వాత కూడ ఆగక పోవడం చూస్తే ప్రభుత్వ ప్రకటనల పట్ల రైతులలో విశ్వాసం కలగలేదని అనిపిస్తుంది. రుణాల మాఫీకి బదులు ఆరునెలల మారిటోరియం ప్రకటించడం, సంస్థాగత రుణాల విషయంలో ఇంకా చెల్లింపులకోసం నిర్బంధం సాగుతుండడం, రుణభారం భవిష్యత్తులోనైనా తగ్గిపోతుందనే ఆశ కలగకపోవడం వంటి కారణాలెన్నో ఆత్మహత్యల పరంపర ఆగిపోకుండా చూస్తున్నాయి. మొదటి రెండు నెలల ఆత్మహత్యలకు కారణంగా తొమ్మిది సంవత్సరాల దుష్టపాలనను చూపవచ్చు గాని ఇంకా కొనసాగుతున్న ఆత్మహత్యలకు ఆ కారణాన్నే చూపలేం. ఇది ఇలా ఉండగా, అక్రమ కనెక్షన్ల తొలగింపు పేరుతో రైతాంగం మీద విద్యుత్ సిబ్బంది ఆగడాలకు, నిర్బంధానికి తలుపులు తెరవడం తప్పనిసరిగా తప్పుడు సంకేతాలనే పంపుతోంది.

అట్లాగే సాగునీటి పారుదల గురించి చాల ఆహ్వానించదగిన చర్యలనే ప్రకటించినప్పటికీ, అవి ఆచరణ సాధ్యమనే నమ్మకాన్ని కలిగించలేకపోతున్నాయి. సాగు నీటి పారుదల రంగం ఎన్నో సంవత్సరాలుగా నిర్లక్ష్యానికి గురయింది. రాత్రికి రాత్రే దాన్ని సవరించడం సాధ్యం కాదు. అందువల్ల ఆచరణ సాధ్యమైన, సూత్రబద్ధమైన, దశలవారీ ప్రణాళికలు రచించుకొని, స్వల్ప కాలిక, మధ్యంతర, దీర్ఘకాలిక ప్రణాళికల ప్రకారం పని నడిపించవలసి ఉంది. కాని ప్రస్తుత ప్రభుత్వ ప్రకటనలు కోటలు దాటుతున్నాయి. ఆచరణ గడపదాటుతుందో లేదో చూడవలసి ఉంది.

అదే విధంగా భూసంస్కరణల గురించి ప్రభుత్వం మళ్ళీ ఒకసారి మాట్లాడడం ప్రారంభించింది. నూతన ఆర్థిక విధానాల తర్వాత ఈ విషయం మాట్లాడడమే ఆగిపోగా, తెలుగుదేశం ప్రభుత్వం, ముఖ్యంగా విజన్ 2020 భూసంస్కరణల వ్యతిరేక దృక్పథాన్ని తీసుకున్నాయి. ఈ నేపథ్యంలో భూసంస్కరణల గురించి మాట్లాడడం సంతోషకరమే. కాని ఒకవైపు కాంట్రాక్ట్, కార్పొరేట్ వ్యవసాయం గురించి మాట్లాడుతూ, మరోవైపు భూసంస్కరణల గురించి మాట్లాడడం పొసగదు. ఈ రెండూ పరస్పర భిన్నమైన వైఖరులు. ఈ రెండు వైఖరులనూ ఒకే వరుసలో ప్రకటిస్తున్నారంటే, వీటిలో సంపన్నులకు అనుకూలమైన కాంట్రాక్టు, కార్పొరేట్ వ్యవసాయానిదే పై చేయి అవుతుందని అర్థం.

ఇక తెలంగాణా విషయంలోనూ ప్రభుత్వ తన ఎన్నికల ప్రణాళికకు, తెలంగాణా రాష్ట్ర సమితితో తన పొత్తుకు భిన్నమైన వైఖరిని అవలంభిస్తోంది. తెలంగాణా ప్రజల ఆకాంక్షలను

(మిగతాది 11 పేజీలో)

పేదవర్గాలను పూర్తిగా విస్మరించిన కాంగ్రెస్

\- తెలుగుదేశం

ఇటీవల జరిగిన సాధారణ ఎన్నికలలో కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి వచ్చింది. కాంగ్రెస్ నాయకులు ఎన్నికలముందు, ఎన్నికల తర్వాత అనేక ఆచరణ సాధ్యంకాని హామీలు, వాగ్దానాలు ఇచ్చారు. అయితే, డా॥వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి 100 రోజుల పరిపాలన నిస్సారంగా, పేదలకు వ్యతిరేకంగా ఉంది. ముఖ్యంగా బడుగు, బలహీన వర్గాల సంక్షేమాన్ని ఈ ప్రభుత్వం విస్మరించింది. అదే విధంగా రైతు సంక్షేమం అంటే కేవలం ఉచిత విద్యుత్ ఒక్కటే సరిపోతుందని, ఇతర కార్యక్రమాలు చేపట్టాల్సిన అవసరం లేదన్నట్లుగా చేతులు దులుపుకుంది. కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో జరుగుతున్న రైతుల ఆత్మహత్యలు ఆ పార్టీ యొక్క అవివేకానికి, అనాలోచిత నిర్ణయాలకు అద్దంపడుతుంది.

డా॥వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఈ 100 రోజుల పరిపాలనలో సాధించిన ప్రగతిని పరిశీలిస్తే...కేవలం ఆశ్రిత పక్షపాతం, కక్షసాధింపు వైఖరి, అస్తవ్యస్తమైన పరిపాలనతో కుంటుపడిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, క్షీణించిన శాంతిభద్రతలు, ఆకాశాన్ని అంటిన నిత్యావసర వస్తువుల ధరలు, సమర్థతకు పాతర, అవినీతికి పెద్దపీట...ఇవే ప్రస్ఫుటంగా కనిపిస్తాయి.

కక్షసాధింపు చర్యలు

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే రాజకీయ కక్షసాధింపు చర్యలు చేపట్టింది. తెలుగుదేశం పార్టీని రాజకీయంగా బలహీన పర్చటానికి ఒక పథకం ప్రకారం అనేక ప్రాంతాలలో తెలుగుదేశం పార్టీకి చెందిన నాయకులపై పెద్ద ఎత్తున దాడులు మొదలు పెట్టారు. ఇప్పటికి రాష్ట్రంలో 119 గ్రామాల్లో తెలుగుదేశం కార్యకర్తలపై దాడులు జరిగాయి. 24 మంది తెలుగుదేశం కార్యకర్తలు హత్యకు గురయ్యారు. 43 మంది గాయపడ్డారు. 24 సంఘటనల్లో ఆస్తులు కోల్పోయారు. ఆ విధంగా కాంగ్రెస్‌పార్టీ తెలుగుదేశం పార్టీని రాజకీయంగా అస్థిరపరచాలన్న ఏకైక ధ్యేయంతో ఈ దాడులకు పాల్పడుతోంది.

శాసనసభా సమావేశాల కాలం వృధా

శాసనసభ బడ్జెట్ సమావేశాల్లో కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిని చూస్తే కేవలం కక్ష సాధింపు చర్యగా గతంలో తెలుగుదేశం ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలపై విచారణ జరిపేందుకు 12 కమిటీలను వేయడానికే శాసనసభా సమావేశాలను ఉపయోగించుకుంది. తమకు ప్రజలు అధికారం ఇచ్చింది తెలుగుదేశం ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలను విచక్షణారహితంగా మార్చటానికేనన్న ధోరణితో వ్యవహరిస్తున్నది. శాసనసభలో ప్రజా సమస్యల మీద చర్చించడం కాని, రాష్ట్రంలో నెలకొన్న దుర్భిక్ష పరిస్థితులను పరిష్కరించాలన్న చిత్తశుద్ధికాని కనవడలేదు. విలువైన అసెంబ్లీ సమయాన్ని దుర్వినియోగం చేశారు.

రైతుల ఆత్మహత్యలు

కాంగ్రెస్‌పార్టీ ఎన్నికల ప్రచారం సందర్భంగా ఆ పార్టీ నాయకులు తెలుగుదేశం హయాంలో 3 వేల మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారన్నారు. తాము అధికారంలోకి వచ్చిన మరుక్షణం ఎటువంటి ఆత్మహత్యలు జరగకుండా చర్యలు తీసుకుంటామని ప్రజలకు మాయ మాటలు చెప్పారు. కానీ, వారు అధికారంలోకి వచ్చిన ఈ 100 రోజులలోనే 1074 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు. 60 మంది చేనేత కార్మికులు ఆకలి చావులకు గురయ్యారు. అదే సమయంలో మేము పదే పదే శాసనసభలో, వెలుపల గత తొమ్మిదేళ్ల తెలుగుదేశం పాలనలో కాంగ్రెస్‌పార్టీ చెప్పిన 3 వేల మంది రైతుల ఆత్మహత్యలకు సంబంధించిన వివరాలను విడుదల చేయాలని కోరటం జరిగింది. అందుకు తగు సమయం కావాలని ప్రభుత్వం కాలయాపన చేస్తూ వచ్చింది. 100 రోజులైనప్పటికీ ఆ వివరాలు అందించలేదు.

హెల్ప్‌లెస్‌గా 'హెల్ప్‌లైన్'

కాంగ్రెస్ ప్రభుత్వం హెల్ప్‌లైన్ పేరుతో ఎంతో ఆర్భాటంగా ప్రకటించిన కార్యక్రమం హెల్ప్‌లెస్‌గా మారింది. ఒక ప్రక్కన పత్రికలు, మరో ప్రక్క బాధ్యత గల రాజకీయ పార్టీగా తెలుగుదేశం ఆత్మహత్యలు చేసుకున్న వారి వివరాలు ప్రభుత్వానికి అందించినప్పటికీ, కేవలం 300 మందికే ఆర్థిక సహాయం అందించింది. మిగతావి ఆత్మహత్యలు కావన్నట్లుగా చిత్రీకరిస్తున్నారు.

మారిటోరియం

ప్రత్యామ్నాయ రుణసౌకర్యం లేకుండా ప్రైవేటు రుణాలపై మారిటోరియం ప్రకటించడం వల్ల గ్రామాలలో రైతులకు ప్రైవేటు అప్పులు కూడా పుట్టే పరిస్థితి లేకుండా పోయింది. ప్రైవేటు రంగంలో 70 శాతం రైతులకు పరపతి అందించే పరిస్థితిని దెబ్బతీశారు. కేంద్ర, రాష్ట్రాలలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ రైతాంగానికి ప్రభుత్వం రుణం 30 శాతం అదనంగా ఇస్తామని ఆశలు రేకెత్తించారు. పేద రైతుల్ని బ్యాంకుల చుట్టూ తిప్పుకుంటున్నారు. అదేవిధంగా గతంలో రైతులకు లభించే ఎరువులు, క్రిమిసంహారక మందులకు లభించే అప్పులు మారిటోరియం తరువాత లభించటంలేదు.

రైతులకు పావలా వడ్డీకే ఆర్థిక సహాయం అందిస్తామన్నారు.

పావలా వడ్డీ దేవుడు ఎరుగు, తెలుగుదేశం ప్రభుత్వం సకాలంలో రుణాలు చెల్లించని రైతులకు 5% వడ్డీ రాయితీ ఇచ్చింది. ఈ అవకాశాన్ని రాష్ట్రంలో నెలకొన్న దుర్భిక్ష పరిస్థితిని గుర్తించి ఈ సహాయాన్ని రైతులకు జూన్ 30, 2004 నుండి డిసెంబరు 31, 2004 వరకు పొడిగించమని కోరగా, ఒక్క రోజు కూడా పొడిగించలేదు. పైగా గతంలో తెలుగుదేశం ప్రభుత్వం 5 శాతం వడ్డీ రాయితీ ఇవ్వగా, తాము అధికారంలోకి వస్తే 3 శాతానికే వడ్డీ ఇస్తామని ప్రగల్భాలు పలికి అది 6 శాతానికే పెంచారు. అదికూడా సహకారం రంగానికే పరిమితం చేశారు. ఇది ఏ విధంగా సమంజసం? దుర్భిక్ష ప్రాంతాలలో తెలుగుదేశం ప్రభుత్వం పరిస్థితులను గుర్తించి పూర్తి వడ్డీ రాయితీ మాఫీ చేసింది.

అనువైన వాతావరణ పరిస్థితులను ఉపయోగించుకోవడంలో వైఫల్యం

రాష్ట్రంలో ఎక్కువ ప్రాంతాలలో వర్షాలు పడి వరి పంటలకు, వాణిజ్య పంటలకు అనువైన వాతావరణం ఏర్పడినప్పటికీ ప్రభుత్వం సరైన నిర్ణయాలు తీసుకోలేక పోయింది. సాగునీరు, విద్యుత్‌లను సక్రమంగా అందించడంలో విఫలం చెందింది. గత 3 సంవత్సరాలలో తీవ్ర కరువు పరిస్థితులు ఏర్పడినప్పటికీ తెలుగుదేశం ప్రభుత్వం రైతులను ఎన్నో విధాలుగా ఆదుకున్నది. ఇక ప్రస్తుత ప్రభుత్వ ఉదాసీనత కారణంగా సకాలంలో బ్యాంకుల నుండి పెట్టుబడి అందక రైతులు దిక్కుతోచని పరిస్థితిలో పడ్డారు. ఒకవైపు వారికి బ్యాంకులు అప్పులు ఇవ్వడం లేదు. ప్రైవేట్ అప్పులు పుట్టడం లేదు. ఫలితంగా రైతులు అనేక కడగండ్లకు గురవుతున్నారు. ఇదేనా కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు చేసే సహాయం?

సబ్సిడీపై విత్తనాల సరఫరాలో వైఫల్యం

వ్యవసాయ శాఖ మంత్రి విత్తనాలను సబ్సిడీ మీద సరఫరా చేస్తామని శాసనసభలో, వెలుపల ఉపన్యాసాలు ఇచ్చారు. కనీసం రైతులకు సబ్సిడీ విత్తనాలు సకాలంలో అందాయో లేదో తెలుసుకోవడానికి ఒక్క సమీక్ష కూడా జరిపిన పాపాన పోలేదు. ముఖ్యమంత్రిగారు రాజీవ్ పల్లెబాట కార్యక్రమంలో జిల్లాలకు తిరిగినపుడు కూడా ఆయన విత్తనాలు సక్రమంగా సరఫరా అవుతున్నాయో లేదో సమీక్ష జరిపిన దాఖలాలు లేవు. సబ్సిడీపై విత్తనాలను జిల్లాలకు సరఫరా చేయాలని జిల్లా కలెక్టర్లు పదేపదే కోరినప్పటికీ ప్రభుత్వం స్పందించిన దాఖలాలా లేవు. అదే విధంగా విత్తనాలతో పాటు వెనుకబడ్డ ప్రాంతాలైన అనంతపూర్, కడప, చిత్తూర్ జిల్లాలకు గత తెలుగుదేశం ప్రభుత్వం భూసారాన్ని పెంచటానికి జింక్‌సల్ఫేట్, జిప్సం 90 శాతం సబ్సిడీతో సరఫరా చేస్తే ప్రస్తుత ప్రభుత్వం ఆ మొత్తాన్ని 50 శాతానికే తగ్గించిన మాట వాస్తవం కాదా.

బిందు, తుంపర్ల సేద్యం సబ్సిడీపై మాటమార్చిన ప్రభుత్వం

బిందు, తుంపర్ల సేద్యాన్ని పెద్ద ఎత్తున ప్రోత్సహించటానికి తెలుగుదేశం ప్రభుత్వం రూ.1200 కోట్లతో సర్వం సిద్ధం చేసింది. 50 శాతం సబ్సిడీతో 4 లక్షల హెక్టార్లలో ఈ ప్రణాళిక అమలులో ఉంది. అయితే తాము అధికారంలోకి వస్తే 90 శాతం రాయితీలు ఇస్తామని కాంగ్రెస్‌పార్టీ ఎన్నికల సందర్భంగా ప్రకటించింది. అదే విధంగా తొలి శాసనసభ సమావేశంలో గవర్నర్ ప్రసంగంలో కూడా బిందు, తుంపర్ల సేద్యానికి 90 శాతం రాయితీలు ఇస్తామని ప్రకటించారు. కానీ 3 వారాలు తిరగక ముందే బడ్జెట్ సమావేశాల్లో 90 శాతాన్ని 50 శాతానికి తగ్గించారు. ఆ తరువాత దుర్భిక్ష ప్రాంతాలకు మాత్రమేనని అన్నారు. చివరకు అదికూడా అమలు పరచడం లేదు.

గిట్టుబాటు ధరలు

మిర్చి, నిమ్మ, టమాట... తదితర పంటలకు గిట్టుబాటు ధరలు అందించడంలో ప్రభుత్వం విఫలమైంది.

పెరిగిన పెట్రో ధరలు-నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదల

మూలిగే నక్క మీద తాటికాయ పడ్డట్టు ప్రజలపై పెట్రోల్, డీజిల్, గ్యాస్, కిరోసిన్ ధరలు అనూహ్యంగా 3 నెలల్లో రెండుసార్లు పెరిగి ఆ భారం మోయలేనిదిగా తయారయింది. అదేవిధంగా బొగ్గు ధరలు పెరిగాయి, ఉక్కు దరలు పెరిగాయి. దీనివల్ల ద్రవ్యోల్బణం ఇటీవలి కాలంలో ఎన్నడూ లేనంతగా 8 శాతానికి చేరుకుంది.

విస్మరించిన బలహీనవర్గాల సంక్షేమం

ఎన్నికలముందు కాంగ్రెస్‌పార్టీ పేద వర్గాలకు పెద్ద ఎత్తున ఆశలు కల్పించింది. తీరా అధికారంలోకి వచ్చాక వారిని పూర్తిగా విస్మరించింది. సమాజంలోని బడుగు, బలహీన వర్గాల సంక్షేమాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేశారు. ఎస్.సి., ఎస్.టి., బి.సి., లకు వార్షిక బడ్జెట్ కేటాయింపులో గణనీయంగా కోత విధించారు.

బి.సి విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు విడుదల చేయలేదు. వారు ఆందోళన చేస్తే వారి సమస్యలను పరిష్కరించకపోగా వారిపై లాఠీ చార్జీలు, అరెస్టులు చేయించారు.

ఉపాధికల్పన శూన్యం

ఎస్.సి., ఎస్.టి.లకు దుర్భిక్ష పరిస్థితుల వల్ల గృహ వినియోగానికి విద్యుత్ ఛార్జీలు భారమౌతున్నాయని నవంబర్ 30,2003 వరకు గత తెలుగుదేశం ప్రభుత్వం రూ॥250 కోట్లు బకాయిలు రద్దు చేస్తే ఈ ప్రభుత్వం గత ప్రభుత్వ హామీతో సంబంధం లేదని ఆ విద్యుత్ ఛార్జీలకు సర్ చార్జీ అదనంగా చేర్చి వసూలు చేయడం జరుగుతున్నది. మరో ప్రక్క దుర్భిక్షం వల్ల ఇబ్బందులు పడుతున్న వ్యవసాయ కూలీలకు ఉపాధి కల్పించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందింది. ఉపాధి కల్పించడం కోసం పనులు మంజూరు చేసి నిధులు కేటాయించకపోగా తెలుగుదేశం ప్రభుత్వం గతంలో మంజూరు చేసిన పనులను కూడా నిలుపుదల చేశారు. దాంతో వ్యవసాయ కూలీలకు వలస పోవడం తప్ప మరో మార్గం లేకుండా పోయింది. అదే విధంగా ఎన్నికలముందు చేనేత

కార్మికులకు ఎన్నో వాగ్దానాలు చేశారు. ప్రస్తుతం చేనేత కార్మికులు ఆకలి చావులకు గురవుతున్నా వారి సమస్యలను పరిష్కరించకుండా గాలికి వదిలేశారు.

మహిళా సంక్షేమంపై కల్లబొల్లి కబుర్లు

మహిళా సంక్షేమం గురించి ఎన్నో కబుర్లు చెప్పారు. కొత్త తరహాలో డ్వాక్రా సంఘాలను ఏర్పాటు చేస్తామన్నారు. పావలా వడ్డీకే రుణాలు అని మురిపించారు. కానీ నేడు డ్వాక్రా సంఘాలను బలహీనపరిచే విధంగా వారికి అందాల్సిన సహాయాన్ని అందకుండా చేస్తున్నారు. వారి మనుగడను దెబ్బతీస్తున్నారు. మధ్యాహ్న భోజన పథక నిర్వహణను డ్వాక్రా మహిళలనుంచి తప్పించే ప్రయత్నం చేస్తున్నారు వారికి రుణాలు అందించడంలేదు.

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే గ్యాస్ సిలిండర్ల మీద పన్నులను పూర్తిగా రద్దు చేసి అతి తక్కువ ధరకు అందిస్తామని హామీ ఇచ్చారు. కానీ, మూడు నెలల్లోనే ధరలను రెండు సార్లు పెంచడడే కాకుండా, నెలకు 4 రూపాయలు పెంచాలని కేంద్ర ఆర్థిక మంత్రి ప్రకటన చేస్తే రాష్ట్రప్రభుత్వం ఒక్క మాటైనా మాట్లాడకపోవడం శోచనీయం. కేంద్ర ప్రభుత్వం త్వరలోనే స్టీల్ ధర పెరిగిందనే కారణంగా సిలిండర్‌ల ధర కూడా పెంచడానికి సిద్ధపడుతున్నది.

అందని పెన్షన్‌లు

వృద్ధులకు, గర్భిణీ స్త్రీలకు, వితంతువులకు ఇచ్చే పెన్షన్‌లు ఇంతవరకు విడుదల చేయలేదు. ఎన్నకలముందు మోసపూరిత ప్రకటనలతో 75 రూపాయలు చాలదని, అధికారంలోకి రాగానే ఆ మొత్తాన్ని 3 రెట్లు పెంచి రూ॥ 225 లు ఇంటికే మనియార్డరు చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చాక అసలుకే మోసం చేస్తున్నారు.

ఒక బల్బుపై ఉచిత విద్యుత్ శూన్యం

పేదవారికి గృహ వినియోగాల కొరకు ఉచిత విద్యుత్ అని ఎన్నికలలో ప్రజలకు మాయ మాటలు చెప్పి ఓట్లు వేయించుకుని అధికారంలోకి వచ్చి ఈనాడు ఒక బల్బు ఉన్న వారికి ఉచిత విద్యుత్ మాట మార్చి కాలయాపన చేస్తున్నారు.

గృహనిర్మాణ తగ్గింపు-రద్దు

బలహీన వర్గాల గృహనిర్మాణానికి సంబంధించి ఈ ఏడాది 8 లక్షలు ఇస్తామని ముందు ప్రకటించి ఆ తర్వాత బడ్జెట్‌లో 6 లక్షలుగా చూపారు. తెలుగుదేశం ప్రభుత్వం మంజూరు చేసి నిర్మాణ దశలో ఉన్న 2.5 లక్షల ఇండ్లను రద్దు చేయడం పేద వర్గాలకు ద్రోహం తలపెట్టడం కాదా! అదే విధంగా పట్టణాలలో 'వాంబే' పథకం క్రింద గత ప్రభుత్వం మంజూరు చేసిన ఇండ్లు లబ్ధిదారులు తమ వాటా రూపంలో డిడిలు చెల్లించినప్పటికి రద్దు చేయడం ఎంతవరకు సమంజసం? ఈ విధంగా పేదల సంక్షేమ పథకాలను నీరుగారుస్తూ ఈ ప్రభుత్వం పేదల వ్యతిరేక వైఖరిని చాటుకొంటున్నది.

రాష్ట్రంలో ప్రాణాంతక వ్యాధుల విస్తరణ

రాష్ట్రంలో దాదాపు అన్ని ప్రాంతాలలో ప్రాణాంతర వ్యాధులు వ్యాపించాయి. డెంగ్యూ, మలేరియా, మెదడువాపు...తదితర విష జ్వరాలు వ్యాపించి పెద్ద సంఖ్యలో పిల్లలు, పెద్దలు ప్రాణాలు కోల్పోతుంటే ఈ ప్రభుత్వానికి చీమ కుట్టినట్లు కూడా లేదు.

గుండెజబ్బు పిల్లలకు వైద్య సదుపాయంపై వెనుకడుగు

రాష్ట్రంలో గుండె జబ్బులతో బాధపడుతున్న 2 లక్షలమంది చిన్న పిల్లలకు రూ.2000 కోట్లు ఖర్చుచేసి ప్రభుత్వపరంగా ఉచిత వైద్య సదుపాయాలు అందిస్తామని ప్రకటించిన ముఖ్యమంత్రి ఆ తరువాత కేవలం రూ.27 కోట్లు మాత్రమే కేటాయించి తన మాటలకు, చేతలకు పొంతన లేదని చాటుకున్నారు.

మద్యపాన నిషేదంపై మాయమాటలు

ఎన్నికలకు ముందు అధికారంలోకి వస్తే దశలవారీగా మద్యపాన నిషేధం అమలుచేస్తామని కాంగ్రెస్ నాయకులు హామీ ఇచ్చారు. బెల్టు షాపులు రద్దు చేస్తామన్నారు. కానీ బడ్జెట్‌లో ఎక్సైజ్ ద్వారా ఆదాయాన్ని దాదాపు రూ.700 కోట్లకు పెంచుతామని ప్రకటించారు. అదే విధంగా మద్యం తయారీదారులకు రేట్లు పెంచారు. ప్రస్తుతం మద్యాన్ని ఎం.ఆర్.పి. ధరకంటే అత్యధికంగా అమ్ముతున్నప్పటికీ ప్రభుత్వం కళ్ళప్పగించి చూస్తున్నదే తప్ప ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదు. దళారులు సిండికేట్లుగా మారితే వారిని ప్రోత్సాహిస్తున్నారు.

యూజర్ ఛార్జీల బదులుగా సర్వీస్ ఛార్జీల వడ్డింపు

యూజర్ ఛార్జీలను రద్దుచేసి ఆ మేరకు ఆసుపత్రుల నిర్వహణకోసం అదనపు నిధులను కేటాయించని కారణంగా రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల నిర్వహణ అధ్వాన్నంగా తయారై, దుర్భర పరిస్థితులు ఏర్పడ్డాయి. కేంద్ర ప్రభుత్వం సర్వీస్ ఛార్జీలను 73 సేవలకు విస్తరించడంవల్ల సామాన్యులు...చివరకు మంగలి షాపులు, చాకలి షాపులు, రెడీమేడ్ షాపులు, కిళ్ళీ షాపుల మీద కూడా అదనపు భారం పడబోతున్నది. దానిపై రాష్ట్ర ప్రభుత్వం నుంచి కనీస స్పందన కూడా లేదు.

నియామకాలలో ఆశ్రిత పక్షపాతం

అధికారంలోకి వచ్చి నూరు రోజులు అయినప్పటికి పరిపాలనపై ముఖ్యమంత్రి పట్టు సాధించలేక పోవడాన్ని, ఆయన తీసుకున్న కొన్ని వివాదాస్పద నిర్ణయాలను పత్రికలు, ఎలక్ట్రానిక్ మీడియా అనేక కథనాలను వెలువరించాయి. ప్రభుత్వ అవినీతి, అసమర్థత, ఆశ్రిత పక్షపాతం.. మొదలైన వాటిని ఫోటోలతో సహా చిత్రీకరిస్తున్నాయి, ముద్రిస్తున్నాయి. ఉదాహరణకు ప్రభుత్వం చేపట్టిన బదిలీలతో పెద్ద ఎత్తున పైరవీకారులు సచివాలయంలో తిష్టవేశారని, బదిలీల కోసం సాక్షాత్తూ, ఓ మంత్రి సచివాలయంలో ప్రామిసరీ నోటు వ్రాయించుకొన్నారని...మొదలైన వార్తలు వచ్చాయి. అదేవిధంగా అర్హత లేని వ్యక్తులకు ఉన్నత పదవులు కట్టబెట్టి బదిలీలు చేయడం.

(టిడిపి జె.ఇ.ఓ ధర్మారెడ్డి, అదే విధంగా అబ్రహాం నియామకాలు) అదే విధంగా తీవ్ర ఆరోపణలతో జైలు పాలైన వ్యక్తి యొక్క భర్తని హోం శాఖ ముఖ్య కార్యదర్శిగా నియమించడం.. మొదలైన వార్తలు ప్రముఖంగా వస్తున్నాయి.

ఆశ్రిత పక్షపాతంతో తమకు కావలసిన వారిని ప్రభుత్వ సలహాదారులుగా ఎడాపెడా నియమిస్తున్నారు. (1. రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుగా కె.వి. రామచంద్రరావు; 2. ప్రభుత్వ ఆర్థిక సలహాదారుగా డి.ఎ.సోమయాజులు; 3. సాంకేతిక సలహాదారుగా సి.ఎస్.రావు; 4. విదేశీ పెట్టుబడుల సలహాదారుగా సి.సి.రెడ్డి; 5. పరిశ్రమలశాఖ సలహాదారుగా పీటర్‌సన్; 6. ముఖ్యమంత్రి అదనపు వ్యక్తిగత కార్యదర్శిగా సూర్యనారాయణరెడ్డి(సూర్యుడు)

పాఠ్యపుస్తకాల పంపిణీలో జాప్యం

గతంలో విద్యార్థులకు పాఠ్య పుస్తకాల సరఫరాలో జాప్యం జరిగితే ఆందోళనకు దిగినవారు ప్రస్తుతం పాఠ్యపుస్తకాల సరఫరాలో జరిగే జాప్యంపై నోరుమెదపడంలేదు.

అదేవిధంగా ప్రభుత్వ అనాలోచిత విధానాల కారణంగా దాదాపు 340 మెడికల్ సీట్లు కోల్పోయి. విద్యార్థుల అవకాశాలకు గండిపడింది.

పొంతనలేని బడ్జెట్ కేటాయింపులు

బడ్జెట్ కేటాయింపులకు, హామీలకు పొంతనలేదు. ఉదాహరణకు ప్రణాళికేతర వ్యయం రూ. 4000 కోట్లు తగ్గిస్తామన్నారు. అయితే, మరో ప్రక్క 2.5 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామంటున్నారు. విద్యుత్ బకాయిలు రూ.1140 కోట్లు బడ్జెట్‌లో పొందుపరచలేదు. అదే విధంగా పెన్షనర్ల డి.ఎ. బకాయిలు చెల్లిస్తామంటున్నారు. ఇంకా నెరవేర్చాల్సిన హామీలు మరెన్నో ఉన్నాయి.స్కీమ్‌ల ఎలకేషన్‌కు, శాంక్షన్‌కు పొంతన లేదు.

ప్రపంచబ్యాంకు రుణాలపై ద్వంద్వ ప్రమాణాలు

ప్రతిపక్షంలో ఉండగా కాంగ్రెస్‌పార్టీ ప్రపంచబ్యాంకు రుణాలను తీవ్రంగా వ్యతిరేకించింది. కానీ, అధికారంలోకి వచ్చాక వివిధ రంగాలలో అభివృద్ధి సాధించటానికి పెట్టుబడులు తప్పనిసరి అని, అందుకోసం రుణాల స్వీకరణ అనివార్యమని చెపుతూ అందుకోసం వివిధ రుణసంస్థల నుండి రుణాలు పొందడానికి ప్రయత్నాలు మొదలుపెట్టింది.

పిపిఎల సమీక్ష, విద్యుత్ ఛార్జీల రోల్ బ్యాక్‌పై రెండు నాల్కల ధోరణి

పవర్ ప్రాజెక్ట్‌ల అగ్రిమెంట్లను సమీక్ష చేసి, విద్యుత్ ఛార్జీలను రోల్ బ్యాక్ చేస్తామని ప్రతిపక్షంలో ఉండగా హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చాక తమ రెండు నాల్కల ధోరణిని చాటుకొంటున్నారు.

బాలకార్మికుల సంఘటనలో నేరస్తులను రక్షించే యత్నం

సమాజంలో హేయమైన బాలకార్మిక వ్యవస్థను ప్రతి ఒక్కరూ ఖండిస్తారు. అయితే బాలకార్మికులతో పనిచేయించుకొంటూ వారికి కనీస వేతనాలు కూడా చెల్లించని సంఘీ ఇండస్ట్రీస్ యజమాని, కాంగ్రెస్ పార్లమెంటు సభ్యుడు అయిన గిరీష్‌సంఘీని కాపాడేందుకు ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డి ప్రయత్నించడం దారుణం. అన్నిరకాల సాక్ష్యాధారాలు వీరిని నేరస్థులుగా చూపుతున్నప్పటికీ, వారిని కాపాడేందుకు సంఘీ ఇండస్ట్రీలో ఒక్క బాలకార్మికుడు కూడా లేడని చెప్పడం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం తన ఆశ్రిత పక్షపాతాన్ని చాటుకొంది.

మంత్రులపై కుంభకోణాల ఆరోపణలు

రాష్ట్ర మంత్రులపై, జెడ్.పి. ఛైర్మన్లపై, ప్రజాప్రతినిధులపై అనేక అవినీతి ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కాంగ్రెస్ ప్రజాప్రతినిధులపై ఇసుక కుంభకోణాలు, టెండర్ల అక్రమాలు వార్తలు వచ్చాయి.

కొంతమంది మంత్రులపై అరెస్ట్ వారెంట్లు వున్నప్పటికి వారిని ప్రభుత్వంలో కొనసాగించటం.

ఇరిగేషన్ ప్రాజెక్టుల్లో అవినీతి

రాష్ట్రంలో 46 వేల కోట్ల రూపాయలతో 26 ఇరిగేషన్ ప్రాజెక్టులను చేపట్టి వాటిని 5 సంవత్సరాలలో పూర్తి చేస్తామని ప్రకటించిన ముఖ్యమంత్రి వాటిని ఒక పద్ధతి లేకుండా కేవలం తన అనుయాయులకు కట్టబెట్టేందుకు పారదర్శకత లేకుండా 9 కంపెనీలను ఎంపిక చేయటం ద్వారా ప్రపంచంలోనే రికార్డ్ సృష్టించారు. ఈ విధానం వల్ల 1989-94లో తమ ప్రభుత్వం ఉండగా ఏవిధంగానైతే కాంగ్రెస్ నాయకులు ప్రపంచ బ్యాంక్ పనులను 150% నుండి 200% అదనపు రేట్లకు చేజిక్కించుకున్నారో, ప్రస్తుతం దానినే పునరావృతం చేస్తున్నారు.

కాంగ్రెస్, టి.ఆర్.ఎస్.ల దోబూచులాట-తగ్గిన రాష్ట్ర ప్రతిష్ఠ

డా॥ వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం, ప్రభుత్వంలో భాగస్వామ్యం అయిన టి.ఆర్.ఎస్. పరస్పర విరుద్ధ ప్రకటనలు చేయడంవల్ల రాష్ట్రంలో అనిశ్చిత పరిస్థితి ఏర్పడింది. ఫలితంగా రాష్ట్ర ప్రయోజనాలు అనేక విధాలుగా దెబ్బతింటున్నాయి. అందులో ముఖ్యంగా ఉపాధికల్పనకు తీరని నష్టం వాటిల్లింది. రాష్ట్రంలో అన్ని రంగాలలో అనిశ్చిత పరిస్థితుల కారణంగా పొరుగు రాష్ట్రాలైన కర్నాటక, తమిళనాడు అన్నిరంగాలలో ఎంతో అభివృద్ధి చెందుతున్నాయి. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇచ్చిన యువతకు ఉపాధి అవకాశాలు ఏవిధంగా కల్పిస్తారు?

ఢిల్లీ చుట్టూ ప్రదక్షిణాలు

ఈ సమస్యలు పరిష్కారం చేయకపోగా రాష్ట్రంలో పేద, బడుగు, బలహీన వర్గాలను నిర్లక్ష్యం చేస్తూ రైతుకు అదునులో పెట్టుబడులు దొరకకపోవడం వల్ల రైతులు దిక్కుతోచని పరిస్థితుల్లో ఉండగా, వీటన్నింటిని పక్కనపెట్టి, అధిష్టానం కనుసన్నలలో

మెలుగుతూ, తన పదవిని కాపాడుకోవడం కోసం ఢిల్లీ చుట్టూ ఇప్పటికి 12 సార్లు ప్రదక్షిణలు చేసి 18 రోజులు ఢిల్లీలో గడపటం కాంగ్రెస్ సంస్కృతికి అద్దంపడుతుంది.

సీఎంకు 'ఇంద్రభవనం'

రాష్ట్ర ముఖ్యమంత్రికి రాజధానిలో ఉన్న భవనాలన్నీ సరితూగనట్లుగా, గతంలో ముగ్గురు మంత్రులు నివశించిన మూడు భవనాలను నేలమట్టం చేసి డా॥ వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డికి ఇంద్రభవనం నిర్మించడం ఎంతవరకు సమంజసం?

పత్రికలపై దుర్భాషలు

రాష్ట్రంలో జరుగుతున్న ఈ విధానాలు ప్రజాస్వామ్య పద్ధతుల్లో ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చేందుకు ప్రయత్నించిన మీడియాపై ఆగ్రహావేశాలు వ్యక్తంచేసి దుర్భాషలాడటం ముఖ్యమంత్రి వంటి బాధ్యతాయుత పదవిలో ఉన్న డా॥ వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డికి ఎంతవరకు సమంజసం?

జన్మభూమి రద్దు

ప్రజలలో జవాబుదారీతనాన్ని పెంచి, ఎక్కడి సమస్యల్ని అక్కడే పరిష్కరించే ఆదర్శవంతమైన జన్మభూమిలాంటి కార్యక్రమాన్ని, స్వయం సహాయక సంఘాలను రద్దుచేయడం బాధ్యతారాహిత్యం.

సొంత ప్రచారానికి 'రాజీవ్ పల్లెబాట'

'రాజీవ్ పల్లెబాట' అనే పేరుతో ప్రజల మధ్యకు వెళుతున్న ముఖ్యమంత్రి డా॥వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి దానిని తన స్వంత ప్రచార కార్యక్రమంగా మార్చివేశారు. ఒకవైపు ప్రభుత్వ కార్యక్రమమని చెప్పుకుంటూ దానికి సంబంధించిన ప్రచార ప్రకటనల్లో కనీసం ప్రధానమంత్రి మన్మోహన్‌సింగ్‌గారి ఫోటో వేయకుండా రాజీవ్‌గాంధీ ఫోటోను, సోనియాగాంధీ ఫోటోను ముద్రించడం ఏవిధంగా సమంజసం? అదేవిధంగా ప్రభుత్వ కార్యక్రమంగా చెప్పుకొనే రాజీవ్ పల్లెబాటలో రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జిగా నియమితులైన దిగ్విజయ్‌సింగ్ పాల్గొనడం, ఆయన తెలుగుదేశంపై విమర్శలు చేయడాన్ని కాంగ్రెస్ ఏ రకంగా సమర్థించుకొంటుంది?

కొత్తదనంలేని యూత్ పాలసీ

గతంలో ఉన్న సి.ఎం.ఇ.వై. పథకం పేరు మార్చి దానిని అమలు చేస్తామని చెపుతున్నారు. దానిని నూతన యువత పాలసీగా పెట్టుకున్నారు. దీనికి రాజీవ్‌గాంధీ పేరుపెట్టడం మినహా ఇందులో కొత్తదనమేమిటో తెలియదు.

హామీలు నెరవేర్చడానికి నిధులెక్కడ?

కాంగ్రెస్‌పార్టీ తన ఎన్నికల మేనిఫెస్టోలో ఎన్నో హామీలు ఇచ్చారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి డా॥ రాజశేఖర్‌రెడ్డిగారు 'రాజీవ్ పల్లెబాట' సందర్భంగా అనేక హామీలు ఇస్తున్నారు. నిధులు లేకుండా వాటిని ఏవిధంగా అమలుచేస్తారు?

*

(6వ పేజి తరువాయి)

గౌరవిస్తారని, తెలంగాణా ప్రజాప్రయోజనాలను కాపాడుతానని చేసిన వాగ్దానాలను విస్మరిస్తూ ఇప్పటికే చాల ప్రకటనలు వెలువడ్డాయి. చర్చలు సాగాయి. తెరాస కూడ మంత్రి వర్గంలో భాగస్వామిగా ఉండగా, ప్రభుత్వం తెలంగాణాకు వ్యతిరేక చర్యలను నిష్పూచీగా ప్రకటిస్తోంది. పులిచింతల నిర్మాణానికి ముందడుగు వేయడం గాని, జి.ఓ. 610 అమలులో తాత్సారం గాని, తెలంగాణా విషయంలో విభిన్న ప్రకటనలు చేయడం ద్వారా గాని ప్రభుత్వం పంపుతున్న సంకేతాలు తెలంగాణాకు అనుకూలమైనవి కావు. చివరికి తెరాసకు చెందిన మంత్రిని ఒక సబ్‌ఇన్‌స్పెక్టర్ అవమానిస్తే చర్య తీసుకోవడంలో కూడా ప్రభుత్వం ముందకు రాలేదంటే, ప్రభుత్వానికి తెలంగాణ అంశం కన్నా ఒక చిన్న ఉద్యోగిని కాపాడడమే ప్రధానమైందన్న మాట.

కొత్త ప్రభుత్వపు వందరోజుల పాలనలో ఎంతో కొంత సరైన దిశలో అడుగులు పడి, మళ్ళీ పోలీసు యంత్రాంగపు ఒత్తిడికి ప్రభుత్వం లొంగిపోతున్నట్టు కనిపిస్తున్న రంగం నక్సలైట్లతో చర్చలు. ఎన్‌కౌంటర్లు ఆపించడంలో, చర్చల ప్రక్రియను ముందుకు నడిపించడంలో ప్రభుత్వం అభినందించదగిన రాజకీయ పరిణతిని చూపింది. తొమ్మిది సంవత్సరాల తెలుగుదేశం పాలనలో అణచివేత ద్వారా అక్రమార్జన అనే తప్పుడు పద్ధతులకు అలవాటు పడిన పోలీసు యంత్రాంగం ఎన్ని అభ్యంతరాలు చెప్పినప్పటికీ, రాజకీయ నిర్ణయానిదే పై చెయ్యి అవుతుందని స్పష్టం చేస్తూ చర్చలకు ముందడుగులు వేసింది. కాని ఇంకా పాత మైండ్‌సెట్‌లోనే ఉన్న అధికారులను అదుపు చేయడంలో విఫలమైంది. కోవర్టులను పద్ధతి ప్రకారం జరిపించిన చంద్రబాబు హయాంలోని పోలీసు అధికారుల ప్రాబల్యాన్ని తగ్గించడంలో విఫలమైంది. ప్రజా ఉద్యమాలను అణచడానికి మాఫియాలను పెంచి పోషించిన పోలీసు అధికారుల కోరలు తీయడంలో విఫలమయింది. తత్ఫలితంగా ఆ అధికారులు చర్చలకు ఆటంకాలు కలిగించడం ప్రారంభించారు. ప్రజల ఆకాంక్షల ఫలితమైన చర్చలకు విఘాతం కలిగే పరిస్థితి ఏర్పడింది.

మొత్తంమీద రాజశేఖరరెడ్డి ప్రభుత్వ పాలన ఇప్పటికే ఒక అడుగు ముందుకు, రెండడుగులు వెనక్కు లా సాగుతోంది. ఈ వందరోజుల పాలనను నిష్పాక్షికంగా సమీక్షించుకుని, చేసిన తప్పులను సరిదిద్దుకుని, చేసిన ఒప్పులను బలోపేతం చేసుకుంటేనే 2004 ప్రజాతీర్పును సార్థకం చేసినట్టవుతుంది.

*

నిర్ణీత కాల వ్యవధిలో లక్ష్య సాధన

-రాపోలు ఆనంద భాస్కర్
ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధికార ప్రతినిధి

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి కాంగ్రెస్‌కు పెట్టనికోట. ఎన్.టి. రామారావు రాజకీయ తుఫాను, పగ్గాలు దక్కిన నేతల చేష్టలతో కాంగ్రెస్ పట్ల ఓటర్లకు మొహం మొత్తడం పాలనా నేపథ్యానికే ముప్పుగా మారింది. 1983 నుంచి రాష్ట్రంలో సమ ఉజ్జీల హోరా హోరీ మొదలయింది. కాంగ్రెస్‌లో ఎదిగి, మంత్రిగా రామారావును మామను చేసుకోగలిగిన చంద్రబాబు నాయుడు తెలుగుదేశంలో స్థానాన్ని ఆక్రమించగలిగే అందరినీ తరిమారు. 1994 విజయం తర్వాత తన మామకే తడాఖా చూపగలిగి, ప్రజల దృష్టిలో దాన్ని సవ్యకార్యంగా మాయచేయగలిగారు. బెంగాల్ మార్క్సిస్టుల మాదిరి తమ పార్టీ రాష్ట్రంలో పెత్తనం చెలాయించాలనే కోరిక ఆయనలో ప్రగాఢమైనా, అడుగులు అందుకు పూర్తి వ్యతిరేకంగా పడ్డాయి. ఈ దశలో 2004 శాసనసభ ఎన్నికలు జరిగాయి. దాని కన్నా ముందు రాష్ట్రంలో వ్యాపించిన అరాచకం, అధికార పార్టీ కార్యకర్తల ఆకస్మిక సంపద, దర్పం, పార్టీల మధ్య వైరుధ్యం ప్రజాజీవనాన్ని అస్థిర పరచడం క్రమంగా వారి పట్ల వ్యతిరేకతకు పునాదులు వేశాయి. రాష్ట్ర ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయుడు తొమ్మిది సంవత్సరాల పాలన తప్పుడు ప్రాధాన్యాలకు ఆలవాలమైంది. స్వయంగా వ్యవసాయ ఆర్థిక శాస్త్రంలో డాక్టరేటు పొందిన చంద్రబాబు వ్యవసాయ, గ్రామీణ సమాజ మూలాల్లోకి బహుళజాతి సంస్థల పెత్తనం చొచ్చుకొచ్చే వెసులుబాటు కలిగించడం చారిత్రక తప్పిదం. ఆర్థిక స్వావలంబన సాధించిన సంస్థ అయినా, రాజ్యమయినా బయటి సంపన్నశక్తుల మీద ఆధారపడటం కొత్తకాదు. కానీ, ఆ బయటి వనరుల వినిమయంలో రూపొందించుకునే ప్రాధాన్యాల లోపం ప్రజలకు శాపంగా మారుతుంది. శాశ్వత వనరుల, సంపద కల్పనలో అప్పులతో పోల్చినప్పుడు వచ్చే తేడా ప్రమాద తీవ్రతను సూచిస్తుంది. ఏ పాలనయినా, ఎవరు పరిపాలించినా అందరికీ అన్నీ అందవు. అన్ని వాగ్దానాలను పూర్తిగా నెరవేర్చడం కూడా అసాధ్యమనేది వాటిని సెలవిచ్చేవారికి కూడా తెలుసు. కానీ, అవసరార్థం అసాధ్యపు వాగ్దానాలు చేసి, అది తీరగానే దానికి విరుద్ధ చర్యలు చేపట్టడం పరిస్థితిని ప్రమాదపు అంచులకు తీసుకెళుతుంది. ఇవన్నీ కలగలిసి, గత అధికార పక్షం పట్ల రాష్ట్ర వ్యాప్తంగా, ప్రాంత ప్రమేయం లేకుండా, వర్గ, కుల, వయో బేధం లేకుండా ప్రజలందరిలో, అందులోను కొత్త తరంలో ఆక్రోశం నింపిన దశలో కాంగ్రెస్ పార్టీ ఉద్యమ పథాన్ని అనుసరించింది. ప్రజా సమస్యలను ఎలుగెత్తిచాటడంలో వామపక్ష, ఇతర పార్టీలతో మైత్రిని సాధించింది. పరిపూర్ణమైన ప్రత్యామ్నాయ రూపాన్ని సాధించింది. ప్రజల ప్రాధ్యానాలను అలక్ష్యపరుస్తున్నారని, పాలక పక్షాన్ని అనుమానింపచేయడంలో కాంగ్రెస్ పూర్తి విజయం సాధించింది. పరిపాలన మార్పిడికి ఓటర్లు సిద్ధమయ్యారు. ఈ నేపథ్యంలో 2004 శాసనసభ ఎన్నికలు కాంగ్రెస్‌ను గద్దెనెక్కించింది.

కాంగ్రెస్ అంతర్గతంగా ప్రజాస్వామిక వ్యవస్థ. అధిష్ఠానం బలీయంగా ఉండి, రాష్ట్ర శాఖలు నిర్వహణ అధికారాలతో, దాదాపు నామినేషన్ పద్ధతితో బాధ్యతలు పొందే విధంగా దాని అంతర్గత పాలన నడుస్తుంది. అధికారానికి వచ్చిన దశలో కూడా, ప్రభుత్వ స్థాపనకు సంబంధించిన విధివిధానాలు పార్టీ అధిష్ఠానం కనుసన్నల్లోనే జరుగుతాయన్నది అందరికీ తెలిసిందే. అందుకే 2004 ఎన్నికల తర్వాత రాష్ట్ర ముఖ్యమంత్రి పదవికి ఎంపిక ఏదైనా ఆశ్చర్యకరమైన రీతిలో జరుగుతుందా అని పరిశీలకులకు ఉత్కంఠ కలిగింది. అయితే పార్టీ అధిష్ఠానం ముఖ్యమంత్రిగా ఎవరు ఉండాలనే దానికి రాష్ట్ర ప్రజల అభీష్ఠాన్ని పరిపూర్ణంగా పరిగణలోకి తీసుకున్నది. పార్టీ అధిష్ఠానం ముందే ప్రకటించకున్నా, డా॥ ఎడుగురి సందింటి రాజశేఖర రెడ్డి భావి పాలకునిగా ప్రజలకు కనిపించారు. ఆయననే కాంగ్రెస్ శాసనసభా పక్షం నాయకునిగా ఎంపికచేసి, ప్రజాభీష్ఠాన్ని అధిష్ఠానం గౌరవించింది. దాంతో పరిపాలనా మార్పిడి అలనాటి చట్టాపట్టాల మిత్రుల్లో ఒకరినుంచి మరొకరికి జరిగినట్లయింది. వారు పక్కజిల్లాల వారే కావడం విశేషం. అయితే, ప్రజల మదిలో స్థిర పడిన వారి రూపాలు, శైలి పూర్తి వైరుధ్యాలతో ఉన్నాయి. డా॥వై.ఎస్. రాజశేఖర రెడ్డి ముఖ్యమంత్రి కావడం ప్రజల ఆకాంక్షగా రూపుదాల్చడం, దానిని పార్టీ అధిష్ఠానం నెరవేర్చడం, అందుకు రాష్ట్రంలోని మిగతా సీనియర్లందరూ సహకరించడం, ఆయన మంత్రి వర్గంలో పిసిసి అధ్యక్షులైన ధర్మపురి శ్రీనివాస్ చేరడం ద్వారా కాంగ్రెస్ ప్రజాతీర్పును ఎంతవినమ్రంగా స్వీకరించిందో వెల్లడయింది.

కాంగ్రెస్ రాష్ట్రంలో నూరురోజుల పాలన పూర్తిచేసుకున్న దశలో ఒక్కసారిగా స్థూలంగా పరికిస్తే, ప్రస్ఫుటంగా కనిపించేది పరిపాలన వ్యవస్థలో, ప్రజలలో మనో దృక్పథం మార్పు. సవ్యదిశలో ప్రాధ్యానాల నిర్దేశం. మానవీయ కోణంతో సంస్కరణలు. భౌతిక, మానవ ప్రతిభావ్యుత్పత్తుల వనరుల పెంపుకోసం లక్ష్యాల విధింపు. నీటి పారుదల, పారిశ్రామిక ప్రాజెక్టుల పరిరక్షణ, విస్తరణకు చొరవ. కాంగ్రెస్ పరిపాలన మొదలు కావడంతో, ఇంతకాలం ఎంతటి ప్రాణాంతక ప్రాధాన్యాలతో రాష్ట్రంలోని అన్ని వ్యవస్థలను గత ప్రభుత్వం అస్తవ్యస్థం చేసిందో వెలుగులోకి వచ్చింది. సామాజిక, ఆర్థిక సమస్యల జటిలతను ఆధారంగా చేసుకుని సాయుధంగా ఉద్యమిస్తున్న నక్సలైట్లతో తొలిరోజు నుంచి చర్చల ప్రక్రియను చేపట్టిన ప్రజాస్వామిక లక్షణం కాంగ్రెస్ ప్రభుత్వానికి ఉంది.

గత తొమ్మిదేళ్ల వ్యవధిలో సాగునీటి ప్రాజెక్టుల కింద లక్ష హెక్టార్ల ఆయకట్టు తగ్గడాన్ని 'సెస్' అనే అధ్యయన సంస్థ, సేద్యమయ్యే భూమిలో 14 లక్షల హెక్టార్ల విస్తీర్ణం తగ్గడాన్ని కంప్ట్రోలర్, ఆడిటర్ జనరల్ తన నివేదిక ద్వారా వెల్లడి చేయడాన్ని పరిగణిస్తే చాలు, గత ప్రభుత్వ పాలనలోని ప్రాధాన్యాలు ఎంత లోపభూయిష్టంగా ఉన్నాయో అర్థం చేసుకోవడానికి. కాంగ్రెస్ ప్రభుత్వం నీటి పారుదల ప్రాజెక్టుల పూర్తికి, ఆయా ప్రాజెక్టులకింద ఆయకట్టు స్థిరీకరణకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వడం, దానికి విదేశీ సంస్థల ఆర్థిక సహకారాన్ని సాధించడం భవిష్యత్ అవసరాల పట్ల బాధ్యత నిర్వర్తించడమే.

ప్రపంచవ్యాప్తంగా వ్యవసాయ రంగాన్ని రక్షించుకోవడానికి, గ్రామీణ కుటీర పరిశ్రమలను విస్తరింపచేయడానికి శ్రద్ధ కనపరుస్తుండగా, రాష్ట్రంలో గత పాలకులు వాటిని దండగమారి పనులుగా భావించారు. అలానే వారి చర్యలూ ఉండినవి. కాంగ్రెస్ మహాత్ముని ఆచరణను గౌరవించి, గ్రామ సీమలు పురోగతి అక్కడి ప్రజల జీవన ప్రమాణం పెరగడంలోనే ఉన్నదని విశ్వసించే సంస్థ. అందుకే వ్యవసాయానికి తప్పనిసరిగా ఉత్పాదక ప్రోత్సాహకాలు ఉండాల్సిందేనని దాని నిష్ఠ. రాష్ట్ర ముఖ్యమంత్రిగా పదవీ స్వీకార ప్రమాణం చేయడంతోనే వ్యవసాయానికి ఉచిత విద్యుత్తు నిస్తూ డా॥ రాజశేఖరరెడ్డి తీసుకున్న నిర్ణయం ఒక చారిత్రక అవసరాన్ని పూర్తిచేసింది. వ్యవసాయరంగంలో శాస్త్రీయత కనిపించకుండా చేసిన ఘనత గత పాలకులది. దాని సవరింపుకోసం వ్యవసాయ సాంకేతిక మిషన్ ఏర్పాటు, నాణ్యమైన విత్తనాలకోసం జాగ్రత్తలు, వాతావరణ స్థితిగతులకు అనుగుణంగా అత్యవసర ప్రత్యామ్నాయ పంట ప్రణాళికలు, తదితర తక్షణ చర్యలు కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్నది.

రాష్ట్రంలో 40 లక్షలు దాటిన విద్యాధిక నిరుద్యోగ యువత ఆక్రోశం మాటలతో ఉపశమించదని కాంగ్రెస్‌కు తెలుసు. వారి భవిష్యత్తును రక్షించేలా చర్యలు చేపట్టడం కాంగ్రెస్ ప్రభుత్వం ముందున్న అతి పెద్దసవాల్. గ్రామీణ సాంకేతిక సమాజాన్ని సాధించడం ద్వారా స్వయం ఉపాధికి నికరమైన దారులు చూపడం ద్వారా మాత్రమే ఇందులో కొంత శాతం మందికి ఆధారం కలిగించే వీలవుతుంది. ఆ దిశలో ఇప్పుడిప్పుడే చర్యలు ఊపందుకుంటున్నాయి.

గత కొన్నేళ్లుగా రాజకీయాల్లో విలువలు పతనం కావడం, అప్పటి అధికార పార్టీ ప్రచార ఆర్భాటం, గోరంతలు కొండంతలతో రాద్ధాంతం తప్ప ప్రజా సంక్షేమకాంక్ష లోపించింది. గ్రామీణ, పట్టణ స్థానిక పరిపాలనా వ్యవస్థను నోడల్ అధికారులు ద్వారా నియంత్రించి, ప్రజాస్వామ్య స్ఫూర్తికి విఘాతం కలిగించింది. దానిని సవరించి, రాజ్యాంగ బద్ధంగా ఆయా స్థానిక సంస్థలకు దక్కాల్సిన అధికారాలను సమకూర్చడం కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాథమిక బాధ్యతగా భావిస్తుంది. ఆ దిశలో చర్యలు మొదలయ్యాయి.

గత ప్రభుత్వం పరిపాలనను సాంకేతిక సౌకర్యాలతో, పారదర్శక పద్ధతులతో, ఆధునాతన శిక్షణతో మెరుగు పరుస్తున్నట్లు చెప్పుకున్న మాటలన్నీ నేతిబీరకాయలోని నెయ్యి అంత నిజమని తేలిపోయింది. ఏకవ్యక్తి పాలనగా మార్చి, రాష్ట్రంలో అధికార యంత్రాంగానికి అయోమయం ప్రసాదించారు. దాని నుంచి యావత్ అధికార యంత్రాగాన్ని బయటకులాగి, వారి బాధ్యతలు నిష్పక్షపాతంగా నిర్వర్తించే అవకాశం కలిగిస్తూ, వ్యవస్థల పునరుద్ధరణకు, పునః పటిష్టీకరణకు కాంగ్రెస్ సంకల్పించింది. అందులో ఫలితాలు కనిపిస్తున్నాయి. అధికారుల్లో జవాబుదారీతనం పెంచే ప్రయత్నం సాగుతోంది.

ఎన్నికలకు ముందు కాంగ్రెస్ అన్ని వర్గాల, అన్ని ప్రాంతాల, అన్ని వయో శ్రేణుల స్త్రీపురుషులందరి సర్వతోముఖాభివృద్ధికి, శాశ్వత వనరుల కల్పనకు, పారదర్శకతకు, జవాబుదారీతనానికి వాగ్దానం చేసింది. ఎప్పటికప్పుడు ఎదురయ్యే అన్ని సమస్యల సావధాన పరిష్కారానికి కాంగ్రెస్ కట్టుబడి ఉన్నది. నిర్దేశించుకున్న లక్ష్యాలకు కాల వ్యవధి పెట్టుకుని, సాధించేందుకు సవ్యదిశలో సాగిపోతున్నది.

*

ప్రభుత్వ యంత్రాంగం మీద పట్టులేదు

- డా॥ కె. లక్ష్మణ్
రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, బి.జె.పి.

డా. వై.ఎస్. రాజశేఖర రెడ్డి నేతృత్వంలో 100 రోజుల కాంగ్రెస్ పాలన ఆశించిన మేరకు లేదు. 5 సంవత్సరాల కొరకు ఎన్నుకోబడిన ప్రభుత్వానికి 100 రోజుల పనితీరు కొలమానం కాకపోయినప్పటికీ, వైఎస్ఆర్ ప్రభుత్వ యంత్రాంగం మీద పట్టు సంపాదించలేకపోతున్నారు. ఆవేశపూరితమైన నిర్ణయాలు తప్పితే అందులో ఆలోచన తక్కువగా ఉంది. రాష్ట్ర దీర్ఘకాలిక ప్రయోజనాలకంటే, వ్యక్తిగత ప్రాబల్యం పెంచుకోవటానికే నిర్ణయాలు తీసుకోవడం, కార్యక్రమాలు చేపట్టడం జరుగుతున్నది.

రైతుల ఆత్మహత్యలు అరికడతామని, రైతు ప్యాకేజి ప్రకటించడం, రైతులకు ఉచితంగా కరెంట్ సరఫరా వంటి నిర్ణయాలు, రైతులకు దోహదపడే అంశాలే అయినప్పటికీ, వాటిల్లో స్పష్టత లోపించడం, ఆదరాబాదరగా తీసుకున్న నిర్ణయాలవల్ల సమగ్ర విధానం లేకపోవడం అనేక అనర్థాలకు దారి తీస్తున్నది.

అక్రమ విద్యుత్ కనెక్షన్లు మొత్తం 3.5 లక్షలు తొలగిస్తాం, ప్రతిఘటిస్తే పోలీసు చర్య అని డా॥ వై.ఎస్.ఆర్ ప్రకటించడం. 100 రోజుల్లోనే రైతులందరికి ప్రకటించిన ఉచిత విద్యుత్ సరఫరాపై ఒకడుగు వెనక్కువేసినట్లయింది. రైతులు ఆత్మహత్యలు చేసుకోకుండా ఏర్పాటుచేసిన 'హెల్ప్‌లైన్లు' నిరర్థకంగా ఉన్నాయి. దాదాపు 36751 మంది రైతులు హెల్ప్‌లైన్లను ఆశ్రయించగా, ప్రయోజనం పొందినవారు వందల సంఖ్యలో కూడా లేరు. రైతులు ఆత్మహత్యలు చేసుకోకుండా నివారించడం కోసం రైతు రుణాలపై ఆరు నెలల మారిటోరియం ప్రకటిస్తే, రైతులకు కొత్త అప్పు పుట్టడం లేదు. పావలా వడ్డీకే రైతులకు రుణాలు అని ప్రచారం చేశారు. కానీ అమలుకు నోచుకోలేదు.

రైతుల ఆత్మహత్యలకు ప్రధాన కారణాలు- రైతులు చేసిన అప్పులు తీర్చలేక, తెచ్చిన అప్పులు బోర్ల తవ్వకానికి వ్యయం చేస్తే నీరు రాకపోవడం, వడ్డీలు భారమై పంటలు లేక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని తెలిసి అనాలోచితమైన నిర్ణయాలు తీసుకున్న ప్రభుత్వం 100 రోజుల్లో 1096 మంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. వీరిలో ఆర్థిక సహాయం అందినది 119 మందికి మాత్రమే. ఇది ప్రభుత్వ పనితీరుకు అద్దం పడుతున్నది. ప్రభుత్వ యంత్రాంగంపై పట్టు సాధించలేక పోతున్నారు.

రాష్ట్రంలో ప్రాజెక్టుల నిర్మాణంపై ప్రభుత్వం కార్యాచరణ ప్రణాళికను ప్రకటించింది. 2 సంవత్సరాలలో 8 ప్రాజెక్టులు, 5 సంవత్సరాలలో 18 ప్రాజెక్టులు, మొత్తం 26 ప్రాజెక్టులు పూర్తిచేస్తామని చెప్పారు. ఆలోచన అద్భుతం...వాటికి కావాల్సిన రూ.46 వేల కోట్లు, నిధుల విషయమై తేల్చలేదు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఈ రంగానికి కేటాయించిన నిధులు నామ మాత్రమే. లక్ష్య సాధనలో చిత్తశుద్ధి కొరవడుతున్నది. ప్రాజెక్టుల నిర్మాణానికి అనుసరిస్తున్న టెండర్ విధానాల్లో పారదర్శకత లోపిస్తున్నది. ప్రాజెక్టుల నిర్మాణం కన్నా అస్మదీయులకు లాభం చేకూర్చాలన్న ఉద్దేశంతోనే విధానాలు రూపొందుతున్నవిగా కనబడుతున్నది.

ఎన్నికలకు ముందు అనేక కులాలను బిసి, ఎస్‌సి జాబితాలో చేర్చుతామని వాగ్దానం చేసి, ఆయా కులాలను, వర్గాలను సంబంధించిన కులాల కమిషన్‌లకు సిఫారసు చేస్తామని, ఏకంగా ముస్లింలను మాత్రం బిసిలలో కలిపి 5% రిజర్వేషన్లు ఇవ్వడం చూస్తుంటే 'ఏరు దాటేదాక ఓడ మల్లయ్య-ఏరుదాటనాక బోడి మల్లయ్య' అనే సామెతగా మారుతుంది వీరి పాలన.

డా॥ వై.ఎస్. అధికారంలో రోజురోజుకి హత్యలు పెరిగిపోతున్నాయి. దాదాపు '60 మందికి పైగా రాజకీయ ప్రత్యర్థులను కాంగ్రెసు పార్టీ నాయకులు హతమార్చారు. అనేక మందిని గాయ పర్చారు. అనంతపురం జిల్లాలో అగ్నికి ఆజ్యం పోస్తున్నట్లుగా పోలీసులు వ్యవహరించడం, రాజకీయ కక్షసాధింపు చర్యలకు అద్దం పడుతున్నది.

మంత్రుల మధ్య సమన్వయం లేదు-విధానపరమైన నిర్ణయాల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. కొంత మంది మంత్రులకు వారి శాఖలపట్ల ఏమాత్రం అవగాహన లేదు. ఎంసెట్ విధానాన్ని రద్దుచేస్తామని సాంకేతిక శాఖమంత్రి ప్రకటిస్తే, ఎంసెట్ కోచింగ్‌ను సాంఘిక సంక్షేమ హాస్టల్స్‌లోను, ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ప్రవేశపెడతామని ఉన్నత విద్యాశాఖామంత్రి ప్రకటించారు.

(మిగతాది 19వ పేజీలో)

పాత విధానాలనే కొనసాగిస్తే...

-బి.వి.రాఘవులు
కార్యదర్శి సిపిఐ(ఎం)

మన సంస్కృతిలో వందకు చాలా ప్రాధాన్యత ఉంది. సినిమా వంద రోజులాడితే శత దినోత్సవం చేసుకుంటారు. క్రికెట్‌లో వంద పరుగులు చేస్తే గొప్పగా ప్రశంసిస్తారు. పెద్దలు నూరు సంవత్సరాలు వర్ధిల్లమని ఆశీర్వదిస్తారు. అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం వంద రోజులు పూర్తి చేసుకుంటే కూడా సంతోషించే పరిస్థితి ఇప్పుడు వచ్చింది. ఐదు సంవత్సరాలకు గాను ఎన్నికయినప్పటికీ, అర్ధాంతరంగానే ప్రభుత్వాలు పడిపోవడం, మధ్యంతరంగా ఎన్నికలు రావడం మామూలవుతున్న రోజులయినందున వంద రోజులు కొనసాగితేనే సంతోషించే పరిస్థితి వచ్చింది.

రాష్ట్రంలో కాంగ్రెస్ నాయకత్వాన ఉన్న ప్రభుత్వం ఆగష్టు 14వ తేదీ నాటికి వంద రోజులు పూర్తి చేసుకున్నది. ఈ వంద రోజుల్లోనే ఈ ప్రభుత్వం గుణ,గణాలన్నీ తేటతెల్లం కాకపోయినప్పటికీ, ప్రభుత్వ ఆలోచనలకు, పని తీరుకు కొన్ని సంకేతాలు తప్పకుండా కనపడుతాయి. ప్రభుత్వం ఏ దిశలో పయనిస్తున్నదో చూచాయగానైనా తెలుసుకోవచ్చు.

కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు ప్రజలను ఆకర్షించడానికి పుంఖానుపుంకాలుగా వాగ్దానాలు చేసింది. అధికారానికొచ్చిన తర్వాత ఆ వాగ్దానాలను అమలు చేసే బాధ్యత మీద పడింది. వాగ్ధానాలు చేయడం ఎంత సులభమో, వాటిని అమలు చేయడం ఎంత కష్టమో బహుశా ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వానికి అనుభవ పూర్వకంగా అర్థం అవుతుంది. గతంలో తెలుగుదేశం పార్టీ ఎన్నికలకు ముందు వాగ్ధానాలు చేయడం, ఎన్నికల్లో గెలిచి పబ్బం గడుపుకున్న తర్వాత వాటిని వమ్ము చేయడం అనవాయితీ చేసింది. కాంగ్రెస్ కూడా అదే త్రోవలో నడుస్తుందేమోనన్న సంశయాలు లేకపోలేదు. ఈ వంద రోజుల పాలనలో వాగ్ధానాల అమలులో ప్రభుత్వ కృషి మిశ్రమ తీరులోనే ఉన్నది.

కొన్ని తక్షణ ప్రజా సమస్యలకు సంబంధించిన వాగ్ధానాలను కొత్త ప్రభుత్వం అమలు చేసే ప్రయత్నం చేసింది. ప్రజలకు అవసరమైన సమస్యల గురించి కొన్ని వాగ్ధానాలను నెరవేర్చింది. ముఖ్యమైన, మౌలికమైన అంశాలమీద అస్పష్టత ఇంకా కొనసాగుతున్నది. కొన్ని విషయాల్లో తిరోగమన చర్యలు తీసుకున్నది. మొత్తం మీద గత ప్రభుత్వం ప్రారంభించిన సరళీకరణ, ప్రపంచబ్యాంకు ఆదేశిత విధానాలను కొనసాగిస్తుందా? వదులుకుంటుందా? అనే విషయం ఇంకా స్పష్టం కావాల్సి ఉంది. పాత విధానాల స్థానంలో ప్రజానుకూల విధానాలు కొత్త ప్రభుత్వం అమలు చేస్తుందన్న విశ్వాసాన్ని ఇప్పటి వరకు కలుగజేయలేకపోయింది.

అధికారంలోకి వచ్చిన వెంటనే రైతులకు ఉచిత విద్యుత్‌ను అమలు చేసింది. ఆసుపత్రులలో యూజర్ ఛార్జీలు రద్దు చేసింది. రైతులకు రుణాలపై మారటోరియం విధించింది. 'జన్మభూమి' కార్యక్రమాన్ని విద్యాకమిటీలను రద్దు చేసింది. వివిధ శాఖల్లో ఉన్న కన్సల్టెంట్‌లను తొలగించారు. పీపుల్స్‌వార్‌తో చర్చల కార్యక్రమాన్ని ప్రారంభించింది. జూలై 22తో ముగిసిన నిషేదాన్ని కొనసాగించలేదు. విద్యుత్ పోరాటం సందర్భంగా అమరులైనవారి కుటుంబాలకు లక్ష రూపాయల చొప్పున ఎక్స్‌గ్రేషియాను ప్రకటించింది. బషీర్‌బాగ్ చౌరస్తాలో అమరవీరుల స్మారక స్థూపాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించి, ఏర్పాట్లు చేస్తున్నది. ముస్లింలకు రిజర్వేషన్లు కల్పించాలని నిర్ణయించి జి.ఓ. తీసుకువచ్చింది. గ్రూపు-1, గ్రూపు-2 ఉద్యోగాల-కోసం నోటిఫికేషన్ విడుదల చేసింది. గ్రూప్-1 అప్లయ్ చేసినవారికోసం వయో పరిమితిని సడలించింది.

కొన్ని తిరోగమన చర్యలను కూడా చేపట్టింది. శాసనమండలి ఏర్పాటు కోసం అసెంబ్లీలో తీర్మానం చేసింది. సహకార సంఘాల్లో వేలాది మంది ఉద్యోగులను తొలగించేందుకు గత ప్రభుత్వం తీసుకువచ్చిన ఆర్డినెన్స్‌ను కాంగ్రెస్ ప్రభుత్వం చట్టం చేసింది. ఈ విషయంలో వామపక్షాలు మినహా టిడిపి-బిజెపి ఇతర అన్ని పార్టీలు ఒకే వైఖరిని తీసుకున్నాయి. కాంట్రాక్ట్ ఉద్యోగులు, కార్మికులు కొనసాగింపు విషయంలో కానీ, రెగ్యులరైజ్ విషయంలో కానీ ప్రభుత్వం ఎటువంటి స్పష్టమైన హామీ ఇవ్వలేదు. ఇంజనీరింగ్ ఫీజుల విషయమై బయ్యపురెడ్డి కమిటీ చేసిన సిఫార్సులను అమలు చేసేందుకు జివో జారీ చేయులేదు. మెడికల్ కాలేజీల్లో మ్యానేజ్‌మెంట్ కోటా కింద ఫీజులు విచ్చలవిడిగా వసూలు

చేసుకునేందుకు, ఎంసెట్ అవసరం లేకుండా అడ్మిషన్లు జరుపుకునేందుకు యాజమాన్యాలకు అవకాశం కల్పిస్తూ 184,185,217 జివోలను విడుదల చేసింది.

రాష్ట్రాభివృద్ధికి, ప్రజా సంక్షేమానికి కీలకమైన, మౌలికమైన కొన్ని విధానాలను రూపొందించడంలో ఇప్పటి వరకు ప్రభుత్వం అస్పష్టంగానే వ్యవహరిస్తున్నది.

విద్యుత్‌రంగానికి సంబంధించి అడ్‌హాక్‌గా నిర్ణయాలు తీసుకుంటూ గందరగోళానికి కారణమవుతున్నది. విద్యుత్ ఛార్జీలు పెంచనని చెప్పి వాగ్దానాలు చేసిన ప్రభుత్వం ఫ్యూయల్ సర్‌ఛార్జీ పేరుతో 90 కోట్ల రూపాయల భారాన్ని మోపింది. ఉచిత విద్యుత్ ప్రకటించే రోజునే దాని వల్ల వచ్చే పర్యవసానాలన్నింటినీ పరిగణలోకి తీసుకుని విధి, విధానాలను రూపొందించలేదు. ఉచిత విద్యుత్ ప్రయోజనాన్ని పొందేందుకు ఇప్పుడు రైతులు కొత్తగా కనెక్షన్లు పెట్టుకుని విద్యుత్ వాడుకోవడంతో, వాటిని అవసరమైతే పోలీసులను వినియోగించి తొలగిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. హడావుడిగా విద్యుత్ ఉత్పత్తి సంస్థలను, పంపిణీ కంపెనీలను బదిలీ చేయాలని ప్రయత్నం చేసింది. విమర్శలు వచ్చే సరికి వెనక్కు తగ్గింది. పంపిణీ కంపెనీల ప్రయివేటీకరణ ప్రయత్నాలను విరమించుకుంటుందో, కొనసాగిస్తుందో ఇంకా స్పష్టం కాలేదు.

తెలుగుదేశం హయాంలో అధికారం, పరిపాలన అంతా ఒక వ్యక్తి చేతిలో కేంద్రీకరించబడింది. స్థానిక సంస్థలు బలహీనం చేయబడ్డాయి. ఈ పరిస్థితిని విమర్శించిన కాంగ్రెస్ అధికారానికి వచ్చిన తర్వాత వికేంద్రీకరణపై శ్రద్ధ పెడుతుందని ఆశించాం. జన్మభూమిని, విద్యాకమిటీలను రద్దు చేసిందిగానీ, 73,74 రాజ్యాంగ సవరణల స్ఫూర్తిని అమలు చేసేందుకు ఇంకా పని ప్రారంభించలేదు. ముఖ్యమంత్రి పల్లెబాట పేరుతో ప్రజాసంపర్క ప్రారంభించారు. ఇది ఒక వినూత్న కార్యక్రమంగా ప్రభుత్వం పేర్కొంటున్నది. స్థానిక సంస్థల చొరవకు ప్రత్యామ్నాయంగా పల్లెబాటను కొత్త ప్రభుత్వం ముందుకు తెస్తున్నదేమోనన్న అనుమానం కలగకమానదు.

కాంట్రాక్టు పద్ధతిని ఒక విధానంగానే గత టిడిపి ప్రభుత్వం అన్ని రంగాల్లో ప్రవేశపెట్టింది. కాంట్రాక్టు పేరుతో ఉద్యోగ భద్రత లేకపోవడం, చట్టబద్ధ సౌకర్యాలను తిరస్కరించడం, కనీస వేతనాలు కూడా ఇవ్వకపోవడం ప్రభుత్వ-ప్రభుత్వేతర రంగాల్లో కొనసాగింది. ఎన్నికలకు ముందు శాశ్వత పనులు కాంట్రాక్టు పద్ధతిన అనుమతించబోమని చేసిన వాగ్ధానం కొత్త ప్రభుత్వం గౌరవిస్తుందా? లేదా? అనే విషయం ప్రశ్నార్థకంగా మారింది. వివిధ శాఖల్లోని కాంట్రాక్టు ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వ స్పందన చూస్తే కొత్త ప్రభుత్వం కాంట్రాక్టు విధానాన్ని కొనసాగించదలచుకున్నదన్న అనుమానం కలుగుతుంది.

సహకార సంఘాల మూసివేతకు, సిబ్బంది తొలగింపుకు గత ప్రభుత్వం తెచ్చిన ఆర్డినెన్స్‌ను కాంగ్రెస్ ప్రభుత్వం చట్టంగా చేసింది. తెలుగుదేశం, కాంగ్రెస్, బిజెపి, టిఆర్ఎస్ పార్టీలు ఐక్యంగా బిల్లుకు అనుకూలంగా ఓటు చేశాయి. వామపక్షాలు మాత్రమే వ్యతిరేకించాయి. అర్బన్ కో-ఆపరేటివ్ బ్యాంకులు అనేకం తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో పేకమేడల్లాగా కూలిపోయాయి. లక్షలాది మంది డిపాజిటర్లు దిక్కులేనివారయ్యారు. దశాబ్దాల నుంచి నడుస్తున్న ప్రుడెన్షియల్, వాసవి లాంటి బ్యాంకులను పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకుంటామని గతంలో కాంగ్రెస్ వాగ్దానం చేసింది. ఇప్పుడు అధికారంలోకి వచ్చిన తరువాత నిస్సహాయతను ప్రకటించింది. ఈ బ్యాంకుల నుండి కోట్లాది రూపాయలను అప్పుగా తీసుకుని చెల్లించకుండా సంక్షోభానికి కారణమైనవారు ప్రధాన పాలక పార్టీల పెద్దలే. అప్పులు చేసిన ఇటువంటి రాజకీయ నాయకుల చేష్టలకు ఆయా పార్టీలు బాధ్యత వహించకపోవడం ఒక ఎత్తైతే, ప్రభుత్వం అటువంటి వారి మీద చర్యలు తీసుకుని, డిపాజిటర్లను రక్షించేందుకు పూనుకోకపోవడం మరో ఎత్తు.

సహకార రంగాన్ని దెబ్బతీసి, ప్రయివేటు రంగాన్ని ప్రోత్సహించడం ప్రపంచబ్యాంకు విధానాల్లో ఒక ముఖ్యభాగం. ఈ విధానాన్నే ప్రస్తుత ప్రభుత్వం కొనసాగించదలచుకున్నదనేది స్పష్టం.

తెలుగుదేశం పాలన పుణ్యమా అని రాష్ట్రంలో వ్యవసాయ రంగం తీవ్ర సంక్షోభంలో పడింది. దేశంలోనే ఎక్కువ రైతుల ఆత్మహత్యలు ఇక్కడ జరుగుతున్నాయి. కొత్త ప్రభుత్వం వచ్చిన తరువాత కూడా ఆత్మహత్యల తీవ్రత తగ్గలేదు. ఆత్మహత్యలు చేసుకున్న కుటుంబాలను ఆదుకునే చర్యలు ప్రభుత్వం చేపట్టినా, అది సమస్యకు పరిష్కారం కాలేదు. రైతులు ఆత్మహత్యలు చేసుకోకుండా నిరోధించడానికి చేపట్టాల్సిన చర్యలు ముఖ్యం. అందులోనూ అప్పుల ఊబినుంచి రైతాంగాన్ని రక్షించడం, అవసరమైన పరపతిని అందించడం ముఖ్యం. ఈ దిశలో ప్రభుత్వం

పెద్దగా పురోగమించలేదు. తక్కువ వడ్డీ అటు ఉంచి, అసలు పరపతే సక్రమంగా రైతులకు అందుబాటులో లేదు.

రాష్ట్రంలో విద్యా, వైద్య రంగాల్లో రాష్ట్రం బాగా వెనుకబడి ఉన్నది. ఈ పరిస్థితిని సరిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం కొత్త ఆలోచనలు ఏమీ చేయడం లేదు. వాస్తవంగా బడ్జెట్‌లో ఈ రంగాలకు తగిన ప్రాధాన్యత ఇవ్వలేదు. నీటి పారుదల రంగానికి బడ్జెట్‌లో పెద్దపీట వేసినందుకు అందరూ సంతోషించారు. కానీ 45 వేల కోట్ల రూపాయలతో, 26 ప్రాజెక్టులను, 5 సంవత్సరాల్లో పూర్తిచేస్తామని ప్రభుత్వం పదేవదే చేస్తున్న ప్రకటనలే విశ్వసనీయతను పొందలేకపోతున్నాయి. నిధుల సమీకరణ, అంతర్ రాష్ట్ర వివాదాల పరిష్కారం గురించి స్పష్టమైన, నమ్మదగిన వివరణలు ఇవ్వకుండా ప్రభుత్వ ప్రకటనలను ప్రజలు విశ్వసించరు.

ఉపాధి కల్పనలో కూడా రాష్ట్రం వెనుకబడే ఉన్నది. ప్రభుత్వ శాఖల్లో ఉండే ఖాళీలనన్నింటినీ గుర్తించి, భర్తీ చేస్తామని కాంగ్రెస్ వాగ్దానం చేసింది. వ్యవసాయ కార్మికులకు 180 పని దినాలను గ్యారంటీ చేస్తామని చెప్పింది. ఈ వాగ్దానాల అమలుకు ఇప్పటి వరకు నిర్ధిష్టమైన చర్యలు చేపట్టలేదు. ఉత్పాదకతను గ్రామీణ ఉపాధికి కీలకమైన భూ సంస్కరణల అమలు గురించి అన్ని వైపులనుంచి విజ్ఞప్తులు వస్తున్నా, ప్రభుత్వం స్పష్టమైన నిర్ణయం ఇంకా తీసుకోలేదు. ప్రాంతీయ అసమానతను తొలగించేందుకు నిర్ధిష్టమైన కార్యాచరణ ప్రణాళికను కూడా రూపొందించే ప్రయత్నాలు ప్రభుత్వ ఆలోచనలో ఉన్నట్లు లేదు. ఇంకా అనేక ముఖ్యమైన విషయాల్లో ప్రభుత్వ ఆలోచనలు ఇంకా అస్పష్టంగానే ఉన్నాయి. విధానాల విషయంలో అస్పష్టత కొనసాగడంతో పాత ప్రభుత్వ విధానాలను, ప్రపంచబ్యాంకు విధానాలను అమలు జరపడానికే దారి తీస్తుంది. గత తెలుగుదేశ ప్రభుత్వ విధానాలను అమలు జరిపేందుకైతే ప్రజలు కాంగ్రెస్‌ను, ప్రతిపక్షాలను ఎన్నుకోవాల్సిన అవసరం లేదు. ఈ విషయాన్ని అధికారంలోకి వచ్చిన పాలకులు గమనించాలి. ప్రజా తీర్పును అర్థం చేసుకుని వ్యవహరించాలి.

రెండు ప్రధాన రాజకీయ సమస్యలు కూడా కొత్త ప్రభుత్వం ముందు ఉన్నాయి. పీపుల్స్‌వార్‌తో చర్చలు నిర్వహించి, రాష్ట్రంలో శాంతియుత వాతావరణాన్ని నెలకొల్పడం మొదటిది. ప్రభుత్వం, పీపుల్స్‌వార్ మధ్య చర్చల విధి- విధానాలకు సంబంధించి మధ్యవర్తుల ద్వారా కొన్ని ప్రయత్నాలు జరుగుతున్నాయి. కానీ ప్రత్యక్ష చర్చలు ప్రారంభం కాకుండా ప్రతిష్ఠంభన ఏర్పడే పరిస్థితులు కనిపిస్తున్నాయి. చర్చల ప్రయత్నం ప్రారంభం అయిన తర్వాత రాష్ట్రంలో నెలకొన్న ప్రశాంత పరిస్థితి అందరికీ సంతోషం కలిగిస్తున్నది. ఈ పరిస్థితిని శాశ్వతం చేసేందుకు కొత్త ప్రభుత్వం కృషి చేయాలి. ఎటువంటి అవరోధం కలగకుండా వ్యవహరించాల్సి ఉంది.

తెలంగాణా రాష్ట్ర సమితి రాష్ట్ర విభజన సమస్యపై సృష్టిస్తున్న గందరగోళం రెండవది. కాంగ్రెస్, టిఆర్ఎస్‌లు ప్రభుత్వంలో భాగస్వాములు. టిఆర్ఎస్ కేంద్ర కాంగ్రెస్ మంత్రివర్గంలో కూడా చేరింది. అయినా, టిఆర్ఎస్ బాధ్యతగా వ్యవహరించకుండా రోజుకొక మాట మాట్లాడుతూ, ప్రజలను మభ్యపెడుతూ అటు కేంద్రంలోనూ, ఇటు రాష్ట్రంలోనూ అధికారాలను అనుభవిస్తూ బాధ్యతలను పెద్దగా పట్టించుకోకుండా వ్యవహరిస్తున్నది. వెంటనే ప్రత్యేక రాష్ట్రం వస్తుందన్న పేరుతో ప్రజా సమస్యలను పట్టించుకోవడం ఇంకెందు'న్నట్టు బాధ్యతారహితంగా మాట్లాడుతున్నారు. క్యాబినెట్‌లో జరిగిన చర్చలకు, యుపిఎ సమావేశంలో ఇచ్చిన పత్రాలంటూ టిఆర్ఎస్ నాయకులు రాష్ట్ర విభజన సమస్యపై రకరకాల ప్రకటనలు చేస్తున్నప్పటికీ, పదేపదే శ్రీమతి సోనియాగాంధీ, శ్రీ మన్‌మోహన్‌సింగ్ గార్ల పేర్లను వాడుకుని ప్రకటనలు చేస్తున్నప్పటికీ కాంగ్రెస్ అధిష్ఠానం నోరుమెదపకుండా, ఇతర నాయకులకు టిఆర్ఎస్‌ను అదుపు చేసే బాధ్యతను అప్పగించి తమాషా చూస్తున్నట్లు ఉన్నది. ఈ ఎత్తులు పై ఎత్తుల్లో నష్టపోయేది రాష్ట్రం, మోస పోయేది ప్రజలు.

కాంగ్రెస్ ప్రభుత్వానికి మొత్తం మీద ఈ వంద రోజులు సంతోషమైన కాలమనే చెప్పుకోవాలి. అయితే రాబోయే కాలం గడ్డుకాలం. గత ప్రభుత్వం చేసిన తప్పిదాల నుంచి నేర్చుకొని, ప్రపంచబ్యాంకు విధానాలను దరిచేరనివ్వకుండా, ప్రజలకు ఉపయోగపడే విధానాలను రూపొందించుకొని ముందుకు పోవాలి. సరళీకరణ విధానాలను తమ విధానాలుగా ప్రకటించుకునే కాంగ్రెస్‌కు ఇది కష్టమే. అయితే ప్రజల మన్ననలను పొందాలంటే మరోదగ్గర మార్గం ఏమీ లేదు. పాత విధానాలనే కొనసాగిస్తే ప్రజలకు ప్రతిఘటన తప్ప మరో మార్గం ఉండదు.

*

పరిపాలనలో ప్రక్షాళన జరగాలి

- డా. కె. నారాయణ
సహాయకార్యదర్శి, సిపిఐ రాష్ట్ర సమితి

కోటి వరాల పేరుతో ఆనాటి ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబునాయుడు తిరుపతి నుండి ఎన్నికల ప్రచారంలోకి దిగారు. ఉచిత విద్యుత్ పేరుతో కాంగ్రెస్ పార్టీ ఆనాటి సి.యల్.పి. నాయకులు డా॥ వై.యస్. రాజశేఖరరెడ్డి ఎన్నికల ప్రచారం హోరెత్తించారు. టిడిపి బిజెపి కూటమిని ఓడించాలని వామపక్షాలు ఎన్నికల నినాదంగా ప్రచారం చేశారు.

ఎన్నికల ప్రచారంలో ముఖాముఖీ పోటీ ద్వారా ప్రతిపక్ష ఓట్లు చీలకుండా రాజకీయ విధానం కొరకు సిపిఐ కృషి చేసింది. ఎన్నికలు జరిగాయి. ఊహించిన దానికంటే ఎక్కువ మెజారిటి సాధించిన కాంగ్రెస్-సిపిఐ, సిపిఐ(యం)లు. అనుకున్న దానికంటే చాలా చాలా తక్కువ సీట్లు తెచ్చుకున్న టిడిపి, ఖంగుతిన్న బిజెపి.

ఉచిత విద్యుత్‌పై తొలి సంతకం చేసి మాట నిలబెట్టుకున్నది నూతన ప్రభుత్వం. వ్యవసాయ ఆధారిత రాష్ట్రంలో నీటి ప్రాజెక్టులపై సమగ్ర పరిశీలన, నిర్మాణం కొరకు తీవ్ర ప్రయత్నం చేస్తున్నది. నికర జలాలతో, అలాగే అదనపు జలాలతో 46 వేల కోట్ల రూపాయలు కేటాయింపుతో నీటి ప్రాజెక్టుల నిర్మాణానికి నడుం కట్టింది.

అయితే 5 సంవత్సరాలలో ఇన్ని వేల కోట్ల రూపాయల సమీకరణ సాధ్యమా? ఖర్చు చేయడం ఆచరణ సాధ్యమా? అని కొంత మందికి అనుమానం. ఇలాంటి అనుమానాలతో నిర్మాణ ప్రయత్నాన్ని నిరుత్సాహపరిచే కన్నా ఉత్సాహపరచడం మంచిది. గత ప్రభుత్వం కూడా అప్పులు చేసింది. అయితే ప్రాధాన్యతలు వేరు. ఆ అనుభవాలతో కాంగీ ప్రభుత్వం జాగ్రత్తపడుతుందని ఆశిద్దాం. పేద ప్రజలకు వ్యతిరేకమయిన యూజర్ ఛార్జీల రద్దు సానుకూల పరిణామం. వ్యవసాయ ఆధారిత పాల, చక్కెర ఫ్యాక్టరీల పునరుద్దరణ ప్రయత్నం అభినందించదగ్గది. రైతాంగ ఆత్మహత్యలపై మానవతా దృక్పధంతో లక్ష రూపాయల పరిహారం, ఋణాలపై ప్రభుత్వ కదలిక సంతృప్తికరం. ఆర్టీసి సంక్షోభానికి ప్రభుత్వ విధానం ప్రధాన కారణం. ఈ నేపధ్యంలో ఆర్టీసి సంస్థకు ప్రభుత్వం నుండి రావలసిన సొమ్మును తిరిగి చెల్లించే నిర్ణయం మంచిది. గతంలో ఆర్టీసి కార్మికులు-ప్రతిపక్ష పార్టీలు ఆందోళన చేసి పాక్షిక విజయమే సాధించారు.

నక్సల్స్ సమస్య శాంతి భద్రతల సమస్యగా గాక, సామాజిక ఆర్థిక సమస్యగా గుర్తించి చర్చలకు సానుకూలత ప్రకటించడం సాహసోపేత చర్య. విద్యుత్ సంస్కరణలకు, ఛార్జీల పెంపుదలకు వ్యతిరేకంగా అచంచల పోరాటానికి పరాకాష్ట 2000 ఆగష్టు 28వ తేదీన హైదరాబాద్ బషీర్‌బాగ్ వద్ద కాల్పులు. ముగ్గుర్ని బలిగొన్న చారిత్రాత్మక ఉద్యమాన్ని ఈ రాష్ట్ర ప్రభుత్వమే గుర్తించి జ్ఞాపక స్థూపాన్ని ఆవిష్కరించింది. మృతులకు లక్ష రూపాయల చొప్పున సహాయ ప్రకటన చేసింది. అయితే ఉద్యోగ ఖాళీల భర్తీ హామీ నత్తనడక నడుస్తున్నది. ప్రైవేటు విద్యుత్ ఉత్పత్తి కంపెనీలపై ప్రభుత్వ వైఖరి నిరుత్సాహకరంగా ఉంది. విద్యుత్ కొనుగోలు ఒప్పందం(సిపిఏ) సమీక్షిస్తానన్న వాగ్దానం నీటిమూటయింది. పాత ప్రభుత్వ బాటలోనే ప్రయాణానికి ప్రయత్నిస్తున్నది. అటు ఉచిత విద్యుత్ వ్యయం, ఇటు ప్రైవేటు విద్యుత్ ఉత్పత్తి విధానంలో, కొనుగోలు పద్ధతిలో మార్పు జరగకపోతే ఆర్థిక వ్యత్యాసం విపరీతంగా ఉండగలదు.

సహకార రంగాన్ని పటిష్టవంతం చేస్తామన్న వాగ్దానం నుండి వెనుకడుగు వేసింది. గత టిడిపి ప్రభుత్వం సహకార రంగాన్ని పూర్తిగా ధ్వంసం చేయపూనుకుంటే సగం మేరకు కాపాడేందుకు ఈ ప్రభుత్వం ప్రయత్నిస్తున్నది. చేనేత రంగంలో ఆత్మహత్యలు-ఆకలి చావులు కొనసాగుతున్నాయి. వారి మెరుగుదలకు ఒక కమిటీ నియమిస్తామన్నారు. కాలయాపన జరుగుతున్నది. ఉద్యోగ, కార్మిక రంగాలలో కాంట్రాక్టీకరణ రద్దు చేస్తామన్న వాగ్దానాన్ని గాలికొదిలింది. వైద్య విద్య విధానాలలో జస్టిస్ జీవన్‌రెడ్డి ఇచ్చిన సూచనలు గమనంలోకి తీసుకోలేదు. వైద్య నిపుణులు లభ్యం కాలేదని చెబుతూనే నిష్ణాతులైన వైద్యులు 52 మందిని కాంట్రాక్టు పద్ధతుల్లో పనిచేయిస్తుండడం ఆశ్చర్యకరం.

కాలేజీలు పునఃప్రారంభించి రెండున్నర మాసాలవుతున్నా 6 వేల మంది కాంట్రాక్టు లెక్చరర్స్‌ను రెన్యువల్ చేయకపోవడం అత్యంత విడ్డూరం. విద్యార్థులకు సిలబస్ పూర్తికాదు. పరీక్షల నోటిఫికేషన్ ప్రకటించబడ్డది. ఎలాంటి ఆర్థిక ఇబ్బందిలేని సరళమయిన సమస్యను సైతం జటిలం చేసి మేధావుల్ని వీధి పోరాటాలకు తరుముతున్నది.

విజయవాడ బార్ అసోషియేషన్ ముఖ్యులపై గత ప్రభుత్వం కక్షసాధింపుగా కోకా కేసు నమోదు చేస్తే ఈ ప్రభుత్వం రద్దు చేయడానికి మీన మీషాలు లెక్కబెడుతున్నది.

పరిపాలనలో ప్రక్షాళన

అధికార యంత్రాంగం పాత పనివిధానాల పరిధిలోనే ఈదులాడుతున్నది. నూతన ప్రభుత్వం వాగ్దానాల అమలుకు అధికార యంత్రాంగాన్ని "శుద్ధి" కార్యక్రమం చేయాలి. లేదా నూతన అధికార గణాన్ని నియమించుకోవాలి. భూ సంస్కరణల అమలుకు అడ్డంకిగా ఉన్న చట్టాలను మార్చాలి. దేవదాయ ధర్మాదాయ చట్టాలు సవరించి చిన్నకారు కౌలుదారులకు న్యాయం జరిగేట్టు చూడాలి.

హింస

రాజకీయ వ్యవస్థలో హింస పనికి రాదు. అయితే 100 రోజులలో పలు రాజకీయ హత్యలు జరిగాయి. పాత కక్షల వలననే హత్యలు జరుగుతున్నాయని చెప్పి తప్పించుకునే ప్రయత్నం ప్రమాదం. గత టిడిపి పాలనలో జరిగిన హత్యాకాండకు నిరసనగా అనంతపురంలో కాంగ్రె, సిపిఐ, సిపిఐయంలు రోజంతా ధర్నా నిర్వహించాం. పాత కక్షలు పేరుతో భవిష్యత్తులో కూడా జరగాల్సిందేనా? దీనికి చరమ గీతం పాడాలి.

బదిలీల బాగోతం

రెవిన్యూ, ఇరిగేషన్, పోలీస్ తదితర ప్రధాన రంగాలలో బదిలీల బాగోతం గుప్పుమన్నది. రాజకీయ కక్షతోపాటు అవినీతి చోటుచేసుకున్నది. సి.యం. సైతం ఖంగుతిని అన్ని బదిలీలను ఆపాల్సి వచ్చింది. ఇవి భవిష్యత్తుకు పెద్ద హెచ్చరిక.

100 రోజుల పాలన

100 రోజుల పాలనలో ప్రభుత్వ పనితీరుపై పూర్తి విశ్లేషణ తొందరపాటు చర్య కాగలదు. స్థూలంగా సంతృప్తికరంగా ఉన్నా అనేక ఇతర అంశాలపై జాగ్రత్త పడాల్సిన అవసరం ఉంది. ప్రజలు ఆశలు బాగా పెంచుకున్నారు. దానికి కారణం రాజశేఖరరెడ్డి వాగ్దానాలే. వాటిని పరిపూర్తి చేయాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే. దీనిని తక్కువ అంచనా వేయకూడదు.

సిపిఐ పాత్ర

బిజెపి-టిడిపి పాలనలో చేదు అనుభవాలు ప్రజలు చవిచూశారు. మరలా టిడిపి-బిజెపిలు అధికారంలోకి కేంద్రంలోనూ, రాష్ట్రంలోనూ రాకుండా చూడాలి. అదే సందర్భంలో ప్రజల పక్షాన నిలబడి పోరాటం సాగించే విధానాలకు సన్నద్ధం కావాలి. ప్రభుత్వం దిగాలనే రాజకీయ నినాదం స్థానే ప్రజాందోళన ద్వారా ప్రభుత్వ సానుకూల పాలన కొరకు వీలయినంత వరకు ప్రయత్నించాలి. సాధ్యంకానపుడు రాజకీయ పరిస్థితిపై సమీక్షించుకోవలసి వస్తుంది.

*

(14వ పేజీ తరువాయి)

గుత్పా ఎత్తిపోతల పథకానికి సంబంధించి ముగ్గురు మంత్రులు మూడు రకాలుగా మాట్లాడారు. ఒకరు సిమెంట్ పైపులు అంటే, మరో మంత్రి స్టీల్ పైపులు అంటారు. మరొకాయన ఫ్యాబ్రికేటెడ్ పైపులంటున్నారు.

తెలంగాణా అంశం-ఒకే ప్రభుత్వంలో భాగస్వాములైన కాంగ్రెస్- తెరాస తలో రకంగా మాట్లాడుతూ ప్రజలను అయోమయానికి గురిచేస్తున్నారు. రాష్ట్ర అభివృద్ధి వీరి పొంతనలేని ప్రకటనల వల్ల కుంటుపడుతున్నది.

అధికారుల బదిలీలు- పాలన నిబంధనలకు భిన్నంగా జరుగుతున్నాయి. పారదర్శకత లోపిస్తున్నది. బదిలీల అవినీతిమయ మవుతున్నది. మూతపడిన పరిశ్రమలను తెరిపిస్తామన్నారు. ఆ ప్రయత్నం ప్రారంభం కాలేదు. డా॥ వై.ఎస్.ఆర్. ప్రతిపక్ష నాయకునిగా డిఎస్‌సి క్వాలిఫైడ్ అభ్యర్థులకు నేరుగా ఉద్యోగాలిస్తామన్నారు ఇప్పుడు వయసు మాత్రం సడలిస్తామంటున్నారు. 1989, 1994లలో క్వాలిఫై అయిన వారికి 10 సంవత్సరాలు వయస్సు సడలించినా ప్రయోజనం లేదు.

కాంట్రాక్టు లేబర్‌ను, కాంట్రాక్టు లెక్చరర్స్‌ను పెర్మనెంట్ చేస్తామన్నారు. ఇప్పుడు మాట మార్చారు. మహిళలకు పావలా వడ్డీ ఆలోచన స్థాయిలోనే నిలిచిపోయింది. అంగన్‌వాడీ మహిళలకు కేంద్ర నిధులలో రాష్ట్ర ప్రభుత్వం జీతభత్యాలు ఊసేలేదు. ఎస్‌సి, ఎస్‌టి, బిసిలకు బడ్జెట్‌లో కేటాయింపులు తగ్గించారు. బిసి విద్యార్థులకు పెండింగ్ స్కాలర్‌షిప్‌లకు మొండి చెయ్యి చూపింది ప్రభుత్వం. అర్హులైన బిసి విద్యార్థులకు స్కాలర్‌షిప్ ఇవ్వలేక పోయింది.

డా॥ వై.ఎస్.ఆర్ చేసిన వాగ్దానాలు విస్మరించకుండా, చేసిన తప్పిదాలు సరిదిద్దుకొని, రాష్ట్రాన్ని ప్రగతి పథం వైపు ముందు చూపుతో వెళ్ళాలి.

*

పంద్రాగస్ట్

- తరిమెల నాగిరెడ్డి

బ్రిటన్ తన సామ్రాజ్యవాద ప్రయోజనాల కొరకు తయారుచేసి అభివృద్ధి చేసుకున్న కిరాయి సైన్యాన్ని భారతదేశం వారసత్వంగా పొందినట్లే "దేశాన్ని సమర్ధవంతంగా పరిపాలించడానికి బ్రిటిష్‌వారు సృష్టించిన పరిపాలనా యంత్రాంగాన్ని కూడా భారతదేశం పొందింది. నూతన భారత ప్రభుత్వం బ్రిటిష్‌వారి నుండి, గ్రామాధికారి నుండి అత్యున్నత కార్యదర్శుల వరకు గల పరిపాలనా యంత్రాంగాన్ని ఎట్టి మార్పు లేకుండా యధాతథంగా స్వీకరించింది. ఆ విధంగా గ్రామీణ ప్రాంతాల్లోని ఫ్యూడల్ పెత్తనాన్ని భారత ప్రభుత్వం స్వీకరించింది. "సహజంగానే భారతదేశంలోని సివిల్ ఉన్నతాధికారులు బ్రిటన్‌లో లాగానే ప్రభుత్వంలో భాగంగానే కాక వ్యక్తిగతంగా కూడ రాజకీయ పలుకుబడిని ప్రయోగించినవారే. ఈ అధికారులలో ప్రధాన భాగం బ్రిటన్‌లో లాగానే భారతదేశంలో కూడ యథాతథ స్థితి నుండి మౌలికంగా వైదొలగకుండా కాపాడే శక్తిగా, పాతస్థితిని క్రమబద్ధం చేసే, సుస్థిరం చేసే ఒక మితవాద శక్తిగా తయారైంది.

(ఏషియన్ డ్రామా-పేజి263)

జవహర్‌లాల్ నెహ్రూ ప్రధానమంత్రి కాకపూర్వం ఎంతోకాలం క్రిందటే తన దేశ ప్రజలను ఉద్దేశించి ఇలా చెప్పాడు:

"ఇండియన్ సివిల్ సర్వీస్(ICS) ప్రభావం మన పరిపాలనా, ప్రజోపయోగ రంగాలలో ఉన్నంతకాలం నూతన వ్యవస్థను నిర్మించడం సాధ్యం కాదని నేను గాఢంగా విశ్వసిస్తున్నాను. అందువల్ల నూతన వ్యవస్థను నిర్మించేందుకు నిజమైన కృషి ప్రారంభించే ముందే ఐ.సి.యస్., తదితర సంస్థలు పూర్తిగా అంతర్ధానమై పోవటం అత్యవసరమని నేను భావిస్తున్నాను. ప్రస్తుతం లాగా వారికి అత్యధిక జీతాలు, అలవెన్సులు, భవిష్యత్తులో చెల్లించబడతాయనేది అసలు అనూహ్యమైన విషయం".

(నెహ్రూ స్వీయ చరిత్ర-పేజి 445)

"వైస్రాయిల జీతాలు ఎంత హెచ్చుగా ఉన్నాయో అదేరీతిలో మొత్తం పాలనాధికారుల జీతాలు కూడా అంతే హెచ్చుగా ఉన్నా"యని చెప్తూ, మహాత్మాగాంధి "అలాంటి అత్యధిక వేతనాలకు వీలు కల్గించే వ్యవస్థ పూర్తిగా రద్దు చేయబడడానికి అర్హమైంద"ని వైస్రాయి లార్డ్ ఇర్విన్‌కు 1930 లో వ్రాసిన లేఖలో వ్యాఖ్యానించాడు.

(కాంగ్రెసు చరిత్ర-పట్టాభిసీతారామయ్య-పేజి 634)

ఈ వ్యవస్థ నెహ్రూ "ఆశించినట్లు"గా "పూర్తిగా అంతర్ధానమై" పోయిందా? లేక అహింసామూర్తి గాంధి విజ్ఞప్తి చేసినట్లుగా "పూర్తిగా రద్దు చేయ"బడిందా? లేదు. బూర్జువావర్గ నాయకత్వం జాతీయ విప్లవానికి చేసిన విద్రోహం వల్ల అప్పట్లో వున్న పరిపాలనా వ్యవస్థను కాపాడింది. అంతేగాక, ఉన్నత అధమ స్థాయిల్లో వేతనాల తేడా కూడా కాపాడబడింది. 'మే అండ్ యస్' పార్లమెంటరీ పద్ధతుల నుంచి క్రింది స్థాయి పాలనోద్యోగుల గూర్చి రహస్య ఫైళ్ళు నిర్వహించడం దాకా శాంతి భద్రతలను కాపాడటానికి వలస పాలనలో రూపొందించి, ప్రవేశపెట్టిన పాలనా పరమైన అలవాట్లు, ప్రొసీజర్లు కూడా ఈ నాటికి రాజ్యం చేస్తున్నాయి.

"జర్మనీ విప్లవం, ప్రతీఘాత విప్లవం" అనే తన గ్రంథంలో విప్లవాలకు ద్రోహం చేసేవారి చర్యల ప్రత్యేక లక్షణాలను మార్క్సు ఎంతో చక్కగా వర్ణించాడు. ఆయన ఇలా అన్నాడు:

"ఐక్య పార్లమెంటు (యునైటెడ్ డైట్) యొక్క ప్రతిపక్ష నాయకులు మంత్రివర్గాన్ని ఏర్పాటు చేయవలసి వచ్చింది. ఆ ప్రతిపక్షం రాజరికాన్ని రక్షించేందుకుగాను, అందుకు నిరంకుశత్వం, అధికార నిరంకుశత్వం, సైన్యం తదితర అంగాలతో కూడాను పాత ప్రభుత్వ యంత్రాంగం యొక్క అండదండలను అది పొందుతుంది. పాత రాజ్యాంగ యంత్రం అంతటినీ "శాంతి భద్రతలను" నెలకొల్పడానికే నాడు వినియోగించారు. ఒక్క నిరంకుశాధికారినిగాని ఒక్క సైనికాధికారిని బర్తరఫ్ చేయలేదు. పాత నిరంకుశాధికార పాలనా పద్ధతిలో ఆవంతైనా మార్పు చేయలేదు. ప్రష్యాలో మంత్రులుగా నున్న వ్యక్తులు తప్ప ఏదీ మారలేదు. చివరికి వివిధ శాఖలలోని మంత్రివర్గ సిబ్బందిని కూడా ఏ మాత్రం ముట్టుకోలేదు".

భారతదేశంలో కూడా అధికార మార్పిడి తర్వాత ఇంతే జరిగిందని మనకు తెలును. వాస్తవానికి అన్ని అధికారాలు, గౌరవాలతో గవర్నర్ జనరల్‌గా, సాయుధ సైన్యాల ప్రధాన సేనానిగ అంతకు ముందున్న బ్రిటిష్ కాలంలో ఉన్నవారే కొనసాగారు.

తన అత్యుత్తమ మిత్రులైన రైతాంగానికి, కార్మిక వర్గానికి, మధ్యతరగతి వర్గానికి వ్యతిరేకంగా బూర్జువావర్గం చేసిన ఈ విద్రోహం చరిత్రలోనే ఎన్నడూ కనీవిని ఎదుగనిది.

ఫ్యూడలిజంతో రాజీ-రాజులు

సంస్థానాలలో ఫ్యూడల్ వ్యవస్థకు వ్యతిరేకంగా ప్రజలు సాగిస్తున్న కనీవిని ఎరుగని తిరుగుబాట్ల బారినుండి, ప్రజలకోపాగ్ని నుండి సంస్థానాధిపతులను రక్షించేందుకుగాను భారత బూర్జువావర్గం వారితో తన రాజీ ప్రయత్నాలను మరింత త్వరితపర్చింది. 1950 నాటికి పూర్వపు సంస్థానాధిపతుల భూభాగాలను వారి సామాజిక, ఆర్థిక ప్రత్యేక హక్కులకు ఎట్టి తీవ్రభంగం లేకుండా కలుపుకొన్నారు. మిర్దాల్ తన "ఏషియన్ డ్రామా"లో చక్కగా చెప్పినట్లుగా "దౌత్యం, బుజ్జగింపులు, చట్టబద్ధమైన లంచగొండితనం" లాంటివి భారత యూనియన్‌లో సంస్థానాధిపతులు చేరేలా ప్రోత్సాహించడానికి వినియోగపడ్డాయి. ప్రజాతంత్ర విప్లవస్వభావానికి పూర్తి విరుద్ధంగా సంస్థానాధీశులకు రాజభరణాలు, అసంఖ్యాకమైన పన్నుల నుండి మినహాయింపులు, వారి రాజబిరుదుల్ని కొనసాగించటం తదితరమైన అనేక ప్రత్యేక హక్కులు కల్పించి వారిని భారత యూనియన్‌లో చేర్చుకొన్నారు. వీటికి తోడు వారిలో అనేక మందిని విదేశరాయబారులుగా, రాష్ట్రాల గవర్నర్లుగా, ఐక్యరాజ్య సమితి సభ్యులుగా ఆకర్షణీయమైన పదవుల్లో నియమించారు. యధాతథస్థితిని, పాత వ్యవస్థను కాపాడేందుకు ఫ్యూడల్ అధికార చిహ్నాలుగా వున్న వీరిపట్ల వీరి ప్రత్యేక హక్కులపట్ల ఉదారంగా వ్యవహరించటం, సామ్రాజ్యవాదంతో రాజీ కుదుర్చుకొని అధికారంలోకి ఎగబ్రాకడం యొక్క మౌలిక సారాంశమైంది.

భారత ప్రజలను మోసగించడానికి ఆడిన బూటకపు నాటకాలలో జమిందారీ వ్యవస్థను రద్దు చేయడం మరొకటి.

జమిందారులకు (మరియు సంస్థానాధీశులకు) వ్యక్తిగత ఆస్థిగా కోట్లాది ఎకరాల భూమిని వదిలేసి, పెద్ద పెద్ద భవనాలను, కోటలను వారి స్వంత ఆస్తిగానే కేటాయించి, అంతటితో చాలక జమిందారీ వ్యవస్థ రద్దు పేరుతో వారికి వందలకోట్ల మొత్తాలలో నష్టపరిహారం చెల్లించారు. జమిందార్లకు చెల్లించిన నష్టపరిహారం మొత్తం ఎంతో ఖచ్చితమైన అంచనాలు అందుబాటులో లేవు. సుమారు 670 కోట్ల రూ॥లు ఉంటుందని ఒక అంచనా తెలియజేస్తోంది. బూటకంగా అమలు పర్చబడిన జమిందారీ వ్యవస్థ రద్దువల్ల సామాజిక ఆర్థిక సంబంధాలలో మౌలికమైన మార్పులు వస్తాయని ఎవరూ ఆశించలేదు. 1948 ఏప్రియల్‌లోనే మౌలికమైన ఎట్టిమార్పుకైనా తాను వ్యతిరేకమని రాజ్యాంగ సభలో నెహ్రూ ప్రకటించాడు. "ఈ చర్యలు తీసుకొనే సందర్భంగా ప్రస్తుతం వున్న నిర్మాణం మరీ ఎక్కువగా దెబ్బతినకుండా జాగ్రత్త వహించాలి. దీన్ని ఇంకెంత మాత్రమూ ధ్వంసం చేసే ధైర్య సాహసాలు నాకు లేవు" అని ఆయన రాజ్యాంగ సభలో ప్రకటించాడు. మనదేశపు మొట్ట మొదటి ప్రధాని చేసిన ఈ మౌలిక ప్రకటన భారత బూర్జువా వర్గం దాని ప్రతినిధులు సామ్రాజ్యవాదంతోనూ, ఫ్యూడలిజంతోనూ చేసుకొన్న రాజీ బేరాల ఒప్పందపు స్వభావాన్ని అత్యంత తేటతెల్లంగా స్పష్టపరుస్తుంది.

విదేశీ పెట్టుబడితో అతి నీచమైన ఒప్పందం

రాజ్యాంగ సభలో ప్రభుత్వం తాను "కామన్ వెల్త్" లో సభ్యురాలిగా ఉండాలని నిర్ణయించుకొంది. దానితో లాహోర్ కాంగ్రెసు ఆమోదించిన "సంపూర్ణ స్వరాజ్యం" అనే ప్రఖ్యాత తీర్మానం బుట్టదాఖలైంది. విదేశీ పెట్టుబడి పూర్తిగా అంతం చేయబడుతుందనే భయం తొలగింది. ప్రధాని నెహ్రూ 1948 ఫిబ్రవరి 17 న "ఆర్థిక నిర్మాణంలో ఆకస్మికమైన ఎట్టి మార్పులుండవు. సాధ్యమైనంత వరకు ప్రస్తుతమున్న పరిశ్రమలను జాతీయం చేయడం జరగదు" అని ప్రకటించాడు. ఇది భారత ప్రజలను సంయుక్తంగా దోచుకొని అత్యధిక లాభాలు గడించటానికి విదేశీ పెట్టుబడితోనూ, అప్పటి దాని ప్రతినిధి అయిన బ్రిటిష్ ప్రభుత్వంలోనూ మిలాఖత్ అవుతామని మరలా భారత బూర్జువావర్గాలు స్పష్టంగా సూచించటమే.

1948 ఏప్రియల్ 6 న విదేశీ పెట్టుబడిదారుల భయాలను, సందేహాలను తొలగించటానికి భారత ప్రభుత్వం ఆర్థిక విధానంపై తాను ఆమోదించిన తీర్మానాన్ని ప్రకటించింది. ఆయుధసామగ్రి, రైల్వేలు, విద్యుచ్ఛక్తి, అణుశక్తి తప్ప "మిగిలిన పారిశ్రామిక రంగమంతటా సాధారణంగా ప్రయివేటు పెట్టుబడికి అవకాశం ఉంటుంది" అని ఆ తీర్మానం పేర్కొన్నది. అంటే అప్పటికున్న సామ్రాజ్యవాద ఫైనాన్సు పెట్టుబడితో సహా, గుత్త సంస్థలకు, తన అనుకూలతను ప్రభుత్వం వ్యక్తం చేసింది. సామ్రాజ్యవాద పెట్టుబడి వర్గాలలో ఇంకా ఏ మూలనైనా మిగిలిఉన్న భయసందేహాలను పూర్తిగా పోగొట్టటానికి, ప్రభుత్వపు ఆర్థిక తీర్మానంతో పాటుగా ప్రచురించబడిన వివరణ పత్రంలో ప్రభుత్వం మరింత స్పష్టంగా ఇలా చెప్పింది.

"భారత పారిశ్రామిక రంగంలో విదేశీ పెట్టుబడి, సంస్థలకు పూర్తి స్వేచ్ఛ ఉంటుందని తీర్మానం హామీ ఇస్తున్నది. అయితే అదే సమయంలో జాతీయ ప్రయోజనాలరీత్యా దాన్ని క్రమబద్ధం చేయడం అవసరం అని భావిస్తోంది" తీర్మానంలోని ఈ భాగంలో నిర్వహణా విధానంలోనూ, సాంకేతిక శిక్షణలోనూ, పెట్టుబడి మదుపు లోనూ, విదేశీ సహాయం అవసరాన్ని, భారత పరిశ్రమలకు సహాయకారిగా విదేశీ పెట్టుబడిని, సాంకేతిక పరిజ్ఞానాన్ని ఆహ్వానించడంలో వున్న విజ్ఞతను భారత ప్రభుత్వం గుర్తిస్తున్నది.

"విదేశీ పెట్టుబడి వ్యాపారానికి భారత పరిశ్రమల్లో పూర్తి స్వేచ్ఛ" ఇవ్వడం అన్నది "భారత రత్నం" అత్యంత గౌరవనీయుడైన అభ్యుదయ కాముకుడైన "సోషలిస్టు" నెహ్రూ నాయకత్వంలోని భారత ప్రభుత్వపు ప్రకటిత విధానమైంది. వలస ప్రభుత్వంచే 1860లో అప్పటి వలస ప్రభుత్వం చేసిన ఒకానొక చట్టం క్రింద 1971 లో నాపై నేరం మోపి ఎందువల్ల నన్ను ఇక్కడ హాజరు పర్చారో న్యాయస్థానం వారు ఇప్పుడు స్పష్టంగా గ్రహించగలరని ఆశిస్తున్నాను. సామ్రాజ్యవాద పెట్టుబడి, దానితో మిలాఖత్ అవుతున్న భారత బూర్జువా వర్గం, ఫ్యూడల్ భూస్వాముల ప్రయోజనాలను కాపాడే ఈ వ్యవస్థను నిర్వహించే రూపాల్లో తప్ప మార్పు ఏమీ సంభవించ లేదని స్పష్టమే. పాలనా నిర్వహణ రూపాలు మారడం తప్ప అసలు విషయం ఎప్పటి లాగానే ఉండి పోయింది. ఆ విధంగా పాత పాలనా వ్యవస్థను, పాత సామాజిక ఆర్థిక వ్యవస్థను, సామ్రాజ్యవాదులు ఏర్పరచిన పరిపాలనా యంత్రాంగాన్ని, పాత నిరంకుశాధికారుల వ్యవస్థ, పాత న్యాయవ్యవస్థ, పాత పోలీసు వ్యవస్థలను-వీటన్నింటినీ భారత "స్వాతంత్ర్యం" పేరుతో కొనసాగించటం నేటి ప్రభుత్వం యొక్క ప్రత్యేక లక్షణంగా ఉన్నది. అలాంటప్పుడు గతంలో జాతీయ విముక్తి విప్లవోద్యమాలను అణచి వేయటానికి సామ్రాజ్యవాదులు వినియోగించిన సెక్షన్ల క్రిందనే నేరారోపణ చేసి నన్ను ఈ కోర్టుకు హాజరు పరచడంలో ఆశ్చర్యమేముంది?

"విదేశీ ప్రభుత్వం స్థానంలో దేశీయ ప్రభుత్వం స్థాపించబడిన తర్వాత కూడా పాత దోపిడి ప్రయోజనాలను ముట్టకుండా ఉన్నట్లయితే అది స్వాతంత్ర్యం యొక్క నీడగా కూడా ఉండబోదు" అని తాను ప్రధాని కాక పూర్వం 14సం॥ క్రితం నెహ్రూ దేశానికి తన అభిప్రాయాన్ని వెలిబుచ్చాడు. (విదర్ ఇండియా-పేజి 1933)

అయితే మోసపూరితమైన అభ్యుదయకరమైన మాటలు చెప్పడం మితవాద అభివృద్ధి నిరోధక కార్యాచరణ సాగించడం బూర్జువావర్గం విధానంగా ఎప్పుడూ ఉంటున్నదే. ఈ విద్రోహం, కుట్రలు, స్వాతంత్ర్యానంతర ప్రారంభ సంవత్సరాల్లో రాజ్యాంగ సభను నిర్మించి, దానిలో రాజ్యాంగాన్ని ఆమోదించడంతో ఉచ్ఛస్థాయికి చేరుకున్నాయి. భారత ప్రజలకు జరిగిన పూర్తి ద్రోహపు సారాంశమే భారత రాజ్యాంగం.

రాజ్యాంగ సభ-భారత ,రాజ్యాంగం

భారత,రాజ్యాంగ సభ చరిత్ర అంతా దేశ ప్రజల సామ్రాజ్యవాద వ్యతిరేక, ఫ్యూడల్ వ్యతిరేక ఆకాంక్షలకు ఘోరంగా విద్రోహం చేసిన చరిత్ర మాత్రమే. రాజ్యాంగ సభ ఏర్పరచిన తీరే అసంగతమైనది, అనుచితమైనది.

దేశ జనాభాలో 90 శాతంగానున్న రైతాంగాన్ని, కార్మిక వర్గాన్ని ఓటింగ్ నుండి మినహాయించి 1935 నాటి భారత ప్రభుత్వ చట్టం ప్రకారం రాజ్యాంగసభ సభ్యులు ఎన్నుకోబడ్డారు. ఈ కొద్ది మంది ఓటర్లు సైతం రాజ్యాంగ సభకు సభ్యుల్ని అందరినీ ప్రత్యక్షంగా ఎన్నుకోలేదు. రాష్ట్రశాసన సభలలో ఎన్నుకోబడిన సభ్యులు కొందరు

ఓటర్లుగా ఏర్పడి ఆయారాష్ట్రాల నుండి కొద్దిమంది సభ్యులను రాజ్యాంగ సభకు ఎన్నుకున్నారు. కొందరు నామినేట్ చేయబడిన సభ్యులు కూడా ఇందులో ఉన్నారు. ఆ విధంగా స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు అనుభవించే ప్రజల రాజ్యాంగ సభకు ఉండవలసిన లక్షణాలలో ఒక్కటి కూడా దీనికి లేకుండా పోయాయి.

1852 లో జర్మనీ పార్లమెంటు 'డైట్' గురించి మార్క్సు వర్ణించినట్లుగా ఇది పాతవలస రాజ్యాంగంతో అక్రమ సంబంధంవల్ల జనించిన 'అక్రమ శిశువు' మాత్రమే. యవ్వనం వచ్చేవరకే 'తన కన్యాత్వాన్ని కోల్పోయి' వెంట్రుకలు తెల్లబడిపోయి కుహనాదౌత్య వ్యభిచారంలో అన్ని యుక్తుల్లో బాగా ఆరితేరి పోయినట్లుగా ఉంది. ఈ రాజ్యాంగ సభలో లిబరల్ న్యాయవాదులు, బ్రిటిష్ విద్యా విధానంలోను, సంస్కృతిలోను, తర్ఫీదు పొందిన సిద్ధాంతవేత్తలైన ప్రొఫెసర్లు మాత్రమే సభ్యులు. పైకి చూడటానికి దేశభక్తియుత భారత మేధావులంతా దీన్లో సభ్యులుగా ఉన్నట్లు అనిపిస్తుంది. వాస్తవానికి అది ముసలి క్షుద్రరాజకీయ వేత్తలు తమ నిర్జీవ ఆలోచనలను, కార్య నిర్వీర్యతను ప్రదర్శించుకొనే ఒక రంగస్థలం వంటిది మాత్రమే. సిద్ధాంత విలువ కూడా ఏ మాత్రం లేని చర్చలు, తర్కవితర్కాలు రెండేళ్ళపాటు సాగించి, అసమర్థమైన ఈ రాజ్యాంగ సభ వచ్చినట్లుగా, "1935 రాజ్యాంగాన్ని అన్ని విధాల పోలిన (ఏషియన్ డ్రామా-పేజి 266) ప్రపంచంలోనే అత్యంత పెద్ద రాజ్యాంగాన్ని రూపొందించింది.

స్వతంత్ర భారతదేశపు రాజ్యాంగంగా చెప్పబడిన ఇది 1935 రాజ్యాంగాన్ని కొట్టొచ్చేట్టు పోలి ఉండటంలో ఆశ్చర్యకరమైనదేమైనా ఉన్నదా? దేశ ఆర్థిక సామాజిక పరిస్థితుల్లో యథాతథస్థితిని నిలబెట్టాలని పాలకవర్గం నిర్ణయించుకొని, ఆర్థిక వ్యవస్థలో ఎట్టి ఆకస్మిక మార్పులు లేకుండా, ప్రస్తుతం ఉన్న నిర్మాణానికి ఏ మాత్రం దెబ్బ తగలకుండా చూడాలని నిర్ణయించు కున్నప్పుడు, అంతకు ముందున్న పాత రాజ్యాంగాన్ని పోలిన రాజ్యాంగాన్ని కాక దానికి మౌలికంగా భిన్నమైన రాజ్యాంగం ఎలా ఆవిర్భవిస్తుంది? భారత రాజ్యాంగం అత్యంత పవిత్రమైందని చెప్పి పాలక వర్గమూ దాని ఏజంట్లూ- భారత ప్రజలను మోసగించారు. అయితే తాము ఆమోదించిన రాజ్యాంగం ఎటువంటిదో బూర్జువా వర్గానికి స్పష్టంగా తెలుసు.

రాజ్యాంగ నిర్మాణంలో ఒకరైన శ్రీ అల్లాడి క్రిష్ణస్వామి అయ్యర్ "మనం విప్లవం తర్వాత సరిక్రొత్త రాజ్యాంగాన్నే మీ ప్రారంభించటంలేదు. ప్రస్తుతం చాలా కాలంగా అమలులో నున్న పరిపాలనా యంత్రాంగాన్ని నూతన వ్యవస్థలో పూర్తిగా అలక్ష్యం చేయలేము" అని రాజ్యాంగ సభలో ప్రకటించాడు.

("స్వాతంత్ర్యానంతరం భారత వ్యవస్థ"-హెచ్. వెంకటసుబ్బయ్య-పేజి 29)

అప్పటికి వున్న సాంఘిక, ఆర్థిక, పాలనా వ్యవస్థ గతంలో లాగే పనిచేస్తూ కొనసాగించినప్పుడు, అప్పటికే ఉన్న రాజ్యాంగం కాక సరికొత్త రాజ్యాంగం ఉండటం అసాధ్యమని రాజ్యాంగాన్ని రూపొందించిన వారికి స్పష్టంగా తెలుసు. అయితే ప్రజలను మోసగించటానికి ఆదేశ సూత్రాలంటూ కొన్నింటిని రాజ్యాంగంలో చేర్చారు. "ప్రజల వామపక్ష విశ్వాసాలను వ్యక్తం చేస్తాయన్న కారణంగా"ను, "ఇతరంగా చూస్తే అంతరించిన బ్రిటిష్ రాజ్యపు రాజ్యాంగ సాధనాన్ని ఎంతగానో పోలిఉన్న ఈ రాజ్యాంగంలో లోపించినట్లు కన్పడుతున్న ఈ విప్లవకర అంశాలను చేర్చడం వాంఛనీయంగా" ఉంటుందని భావించిన కారణంగాను ఇలా చేర్చామన్నారు. (పై పుస్తకం-పేజి 29)

ఆ విధంగా మన రాజ్యాంగం సామ్రాజ్యావాదులచే ఎంతో జాగ్రత్తగా ఎంతో శ్రమపడి వేసిన పునాదులపై నిర్మించబడిన ఉపరితల నిర్మాణం మాత్రమే. అప్పటికే ఉన్న న్యాయ వ్యవస్థను, పరిపాలనా వ్యవస్థను వాటి చట్టాలు, నియమ నిబంధనలతో సహా చట్టబద్ధం చేయటం, అప్పటికి అమలులో ఉన్న సామాజిక ఆర్థిక వ్యవస్థను మరింత బలీయం చేయటం ఈ నూతన రాజ్యాంగం యొక్క అసలు ఉద్దేశం. ఆ విధంగా 'జాతీయ నాయకత్వం' పేరిట ప్రాతినిధ్యం వహించిన బూర్జువావర్గం భారత ప్రజలను విద్రోహానికి గురిచేయటాన్ని ఈ రాజ్యాంగం పూర్తి చేసింది. నూతన రాజ్యాంగాన్ని ఆమోదించడంతో అప్పటికున్న నిర్మాణ వ్యవస్థ పదిలతకు ఏ మాత్రం దెబ్బ తగలకుండా భారత బూర్జువా వర్గం దేశంలో అధికారాన్ని స్వీకరించింది.

మన రాజ్యాంగ నిర్మాతల్లో తెలివైనవారు కొందరు అటువంటి పరిస్థితుల్లో అంతర్గతంగా ఇమిడివుండి నిరంతరం పెరుగుతూ సామాజిక విప్లవానికి దారితీసే వైరుధ్యాలను ముందుగానే ఊహించారు. రాజ్యాంగసభ అధ్యక్షుడైన డా॥ రాజేంద్రప్రసాద్ రాజ్యాంగాన్ని ఆమోదించడానికి కొంచెం ముందుగా ఇలా ప్రకటించాడు: "ఏదో ఒక దృక్కోణం నుండి పరిశీలించే కొందరికి మన రాజ్యాంగంలో అభ్యంతరకర అంశాలున్నట్లుగా కనిపిస్తుంది. అయితే ఈ లోపాలు దేశ పరిస్థితిలోను, దేశ ప్రజల్లోను అంతర్గతంగానే ఇమిడి ఉన్నాయని మనం దుర్తించాలి"

దేశ పరిస్థితుల్లో అంతర్గతంగా ఇమిడిఉన్న ఈ వైరుధ్యాలేమిటి? అవెక్కడికి దారితీస్తాయి? ముసాయిదా రచనా కమిటి అధ్యక్షుడిగా రాజ్యాంగాన్ని రచించడంలో ముఖ్యపాత్ర వహించిన అంబేద్కర్ 1949, నవంబర్ 25న భారత రాజ్యాంగ సభలో నూతన రాజ్యాంగం మూడవ పఠనం సందర్భంగా జరిగిన చర్చకు ఇచ్చిన సమాధానంలో పరిస్థితులను గురించి మరికొంత స్పష్టంగా చెప్పాడు. ఆయన ఇలా అన్నాడు. "1950 జనవరి 26 న వైరుధ్యాలతో కూడిన జీవితంలో మనం ప్రవేశించబోతున్నాం. మనకు రాజకీయాల్లో సమానత్వం, ఆర్థిక జీవితంలో అసమానత్వం ఉంటాయి. రాజకీయాల్లో ఒక్క మనిషికి ఒక ఓటు, ఒక్క ఓటుకు ఒకే విలువ అనే సూత్రాన్ని మనం గుర్తించబోతున్నాం. మనకున్న సామాజిక ఆర్థిక నిర్మాణం కారణంగా మన సామాజిక ఆర్థిక జీవితంలో ఒక మనిషికి ఒకే విలువ అనే సూత్రాన్ని తిరస్కరించడాన్ని కొనసాగిస్తూనే ఉంటాము.. సాధ్యమైనంత వేగిరంగా ఈ వైరుధ్యాన్ని మనం తొలగించాలి. లేనట్లయితే అసమానత్వానికి గురయ్యేవారు- ఈ సభ ఎంతో శ్రమపడి నిర్మించిన రాజకీయ ప్రజాస్వామిక నిర్మాణాన్ని ప్రేల్చివేస్తారు".

ఆ విధంగా అప్పటి సామాజిక వ్యవస్థలో అంతర్గతంగా ఇమిడి ఉన్న వైరుధ్యాల కుప్పయే మన రాజ్యాంగం. సామ్రాజ్యవాద దోపిడికి, ఫ్యూడల్ భూస్వామ్య విధానానికి సామాజిక ఆర్థిక పునాదిని కొనసాగించడానికే ఈ రాజ్యాంగం ఉద్దేశించబడిందనేది నిస్సందేహం.



నిరంతరం శ్రమించే రైతన్నల కోసం

ఋణం చెల్లింపులో సౌలభ్యం
బ్యాంకుల ద్వారా పరపతి సౌకర్యం

రుణభారంతో విలవిలలాడుతున్న రైతాంగాన్ని ఆదుకొనేందుకు రాష్ట్ర ప్రభుత్వం ముందుకు వచ్చింది. నానాటికి పెరుగుతున్న వడ్డీ రైతన్నకు భారంగా మారింది. అసలు కన్నా వడ్డీ ఎక్కువై అమాయక రైతులను కబళిస్తోంది. అందుకే రుణం చెల్లింపులో సౌలభ్యం కలిగిస్తూ ప్రాణత్యాగం చేసుకొనే దారుణం నుండి రైతును కాపాడేందుకు ప్రభుత్వం ఈ ప్యాకేజీని అమలు చేస్తోంది.

ప్యాకేజిలో ఉన్న ప్రత్యేకతలు

- వర్షాలు పడక, పంటలు పండక, అల్లాడుతున్న రైతాంగాన్ని ఆదుకోవాలని, అలాగే అన్ని ప్రాంతాల రైతులకు విరివిగా అప్పులివ్వాలని భారతీయ రిజర్వుబ్యాంకు, కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశానుసారం రాష్ట్రస్థాయి బ్యాంకర్ల సమితి నిర్ణయించింది.
- గడిచిన 5సం॥ కాలంలో వరుసగా రెండు సంవత్సరములు రాష్ట్ర ప్రభుత్వం కరువు మండలాలుగా ప్రకటించి వుంటే, ఆ ప్రాంత రైతుల రుణాలను వాయిదా వేస్తారు. ఈ మండలాల్లో మార్చి 2004 నాటికి పంట ఋణాల్లో బాకీ (అసలు+వడ్డీ) మరియు ఇతర వ్యవసాయ కాలపరిమితి రుణాలు కలిపిన మొత్తాన్ని 5సంవత్సరాలలో చెల్లించే విధంగా వాయిదా వేస్తారు. ఈ 5సంవత్సరాల కాలంలో మొదటి రెండు సంవత్సరములు రైతు ఏమీ చెల్లించకుండా మొత్తం చివరి 3సంవత్సరాలలో చెల్లించే విధంగా వాయిదాల తీర్మానం, వాయిదా వేసిన మొత్తానికి ప్రస్తుతం అమలులో వున్న వడ్డీ విధిస్తారు. వాయిదా వేసిన రైతులందరికీ మళ్ళీ పంట రుణాలు మంజూరు.
- ఇంతవరకు రుణము పొందని రైతులు తమతమ పట్టాదారు పాసు పుస్తకాలు, భూమి రికార్డులు, పత్రములతో సంబంధిత బ్యాంకు మేనేజరుని కలిసి అప్పుకోసం దరఖాస్తు చేసుకోవచ్చు.
- రాష్ట్రంలో మొట్టమొదటి సారిగా రుణాలు చెల్లించలేక ఆత్మహత్యలు చేసుకున్న రైతు కుటుంబాలకు, ఒన్‌టైమ్ సెటిల్‌మెంట్ క్రింద రూ.50,000/-ల మొత్తం వరకూ వడ్డీ/అసలు మాఫీ.



- ఇది రాష్ట్రప్రభుత్వం రైతులకు అందిస్తున్న సహాయం. విలువైన జీవితాలను ఉరితాళ్ళకు బలిచేసుకోవద్దు.
- మీ ఆత్మహత్యలతో మీ భార్యాబిడ్డల రుణానుబంధాలు తీరుతాయనుకోవద్దు.
- ఈ అవకాశాన్ని అందుకోండి, కొత్త రుణాలను పొందండి.

ఈ ప్రభుత్వం.. ప్రజల ప్రభుత్వం.. రైతుల ప్రభుత్వం !

కృష్ణ పుష్కరాలు - ఆగష్టు 28 నుండి సెప్టెంబర్ 8,2004 వరకు

జారీచేసినవారు : సమాచార పౌరసంబంధాల శాఖ

రాజ్యాంగంలోని ఆదేశిక సూత్రాలు ప్రజలను సంతృప్తిపర్చి మభ్య పెట్టడానికి తప్ప వేరుగాదు. "ప్రజల తిరుగుబాటు శక్తి పట్ల భయం వల్ల ప్రేరేపించబడి చేర్చబడినవే" (హెచ్. వెంకటసుబ్బయ్య- స్వాతంత్ర్యానంతరం భారత ఆర్థిక వ్యవస్థ).

చట్ట నిర్మాతల్ని హింసాయుత తిరుగుబాటు భయం వెన్నాడింది. అందువల్లనే వారు అమలుపరచడానికి అధికారాలు లేని నిర్దిష్టమైన హామీలు లేని ఆదేశ సూత్రాలనబడే వాటి ద్వారా ప్రజలకు వాగ్దానాలు చేసే విధానాన్ని అనుసరించారు. సామ్రాజ్యవాదం, ఫ్యూడలిజాల నిరంతర భారీ దోపిడీ సహా అన్ని రకాల దోపిడీని అమలు చేయగల కాపాడగల అధికారాలని అట్టిపెట్టుకున్నారు.

ముగింపు

ఆ విధంగా జాతీయ విముక్తి కోసం భారత ప్రజల ఉద్యమం ఉన్నత స్థాయినందుకొన్న తరుణంలో, బ్రిటిష్ వలసవాదులు బడాబూర్జువా వర్గంతో, బడా భూస్వాములతో రాజీ కుదుర్చుకొన్నారు. బ్రిటిష్ వలసవాదుల ఆర్థిక ప్రయోజనాలను మౌలికంగా పదిలంగా ఉంచాలన్న రహస్య ఒడంబడికతో బ్రిటిష్ వలసవాదులు తమ పాలనని వారికి దత్తం చేశారు.

ఫలితంగా విదేశీ పెట్టుబడులు భారతదేశంలో రక్షించబడటమే కాక బ్రహ్మాండమైన వేగంతో పెరగడానికి ఇది ఏ విధంగా దారితీసిందో ఈ ప్రకటనలో ముందు ముందు కోర్టువారు గమనించగలరు.

ఫ్యూడల్ సంస్థానాధిపతుల, జమీందారుల కొన్ని ప్రత్యేక హక్కులు రద్దు చేయబడినప్పటికి ఫ్యూడల్ భూమి వ్యవస్థ, దాని ద్వారా ఫ్యూడల్ వర్గ సంబంధాలు, కుల సంబంధాలు మొత్తం మీద పరిరక్షించబడటమే కాక కొన్ని అంశాల్లో మరింత బలీయం చేయబడ్డాయి కూడా.

అంతేకాదు భారత ప్రభుత్వం, విదేశీ సహాయంపై ఆధారపడటం అంతకంతకూ తీవ్రమవజొచ్చింది. స్వాతంత్ర్యం ప్రకటించబడిన 25 సంవత్సరాల అనంతరం కూడా ఆర్థిక స్వాతంత్ర్యం అనేది ఒక ఎండమావిలాగా తయారయ్యింది.

భారతదేశం నేటికీ అర్ధ వలస, అర్ధ ఫ్యూడల్ దేశమే. ఫలితంగా గున్నార్ మిర్డాల్ తన మాటల్లో ఎంతో స్పష్టంగా చెప్పినట్లుగా-"ఈ నాటకం పతాక స్థాయికి త్వరత్వరగా పరిగెడుతోంది"... "ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా ఉద్రిక్తతలు తారస్థాయి నందుకుంటున్నాయి...

"బహిరంగ ప్రకటనలను వినేవారు, పత్రికలు చదివేవారు, వివిధ జీవన రంగాలలోని వ్యక్తులతో చర్చించేవారు, బహిరంగం రహస్య విషయాల్లో చర్యలను, ప్రతిచర్యలను పరిశీలించేవారు, నటనను వాస్తవాలను, సాధించిన విజయాలను ప్రకటిత ఆశయాలను పోల్చిచూసేవారు, ప్రయత్నాలను వాటి ఫలితాలను బేరీజు వేసేవారు, కంటికి కనబడే ప్రతి విషయములోను ఇమిడిఉన్న అసాధారణ వ్యత్యాసాలను గూర్చి ఆలోచించేవారు- వీరిలో ఎవ్వరూ కూడా- అత్యంత త్వరితమైన మార్పుకోసం ప్రేలిబద్ధలయ్యే విధంగా ఉన్న అవకాశాల దొంతరల పేర్పుని గమనించకుండా ఉండలేరు. మహా మొండైన జటిలమైన బాహ్య ఇబ్బందులను, అంతరంగిక అడ్డంకులను, మార్పుకి గల ఆటంకాలను గ్రహించకుండా ఉండలేరు". (ఏషియన్ డ్రామా-పేజి 34,35)

ఈ ఉద్రిక్త పరిస్థితి నేడు అత్యంత తీవ్రస్థాయిలో ఉంది. అందువల్లనే భారతదేశంలో శాంతి భద్రతల బాధ్యతను స్వీకరించిన భారత పాలకవర్గాలు బ్రిటిష్ పాలనలో కంటే స్వతంత్ర పాలనలోనే మరింత తుపాకీ ప్రియులుగా ఉన్నాయి.

ఈ పరిస్థితుల్లో భారత జాతీయ విమోచనోద్యమం ఇంకా ఎందుకు పూర్తి కాలేదో, తమ పోరాటాన్ని మరింత దృఢ నిశ్చయంతో, మరింత శక్తితో కొనసాగించటం భారత ప్రజల కర్తవ్యమని భారత జాతీయ విమోచనోద్యమానికి ప్రాతినిధ్యం వహిస్తున్న మేము ఎందుకు నమ్ముతున్నామో కోర్టువారికి వివరించటం నా కర్తవ్యంగా భావిస్తున్నాను.

కామ్రేడ్ మావోసేటుంగ్ ప్రకటించినట్లుగా "ప్రధానంగా విదేశ సామ్రాజ్యవాద శక్తులను, దేశీయ ఫ్యూడల్ శక్తులను కూలద్రోసి స్వతంత్ర, ప్రజాతంత్ర రాజ్యాన్ని స్థాపించినపుడే బూర్జువా ప్రజాతంత్ర విప్లవం విజయం పొందిందని భావించగలం".

ఒక సామాజిక వ్యవస్థను...ప్రజాతంత్ర సమాజాన్ని స్థాపించటమే ఈ ప్రజాతంత్ర విప్లవం యొక్క లక్ష్యం. ఈ సమాజానికి ముందు ఫ్యూడల్ వ్యవస్థ (గత 100 సం॥లుగా ఇది అర్ధవలస- అర్ధ ఫ్యూడల్ వ్యవస్థగా ఉంది) అమలులో ఉంది. సోషలిస్టు సమాజం దీని వారసురాలు (మే ఫోర్త్‌మూవ్‌మెంట్)

*

Owned, Printed and Published by V.Hanumantha Rao at D.No.8-3-898/22, Road No.3, Nagarjuna Nagar, Hyderabad-5000 073 Ph: 23748672, DTP at Samata Graphics, Hyderabad. Printed at Akruti, Chikkapalli, Hyderabad. Editor: V.Hanumantha Rao